

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 20-08-2025 | సంపుటి - 24 | సంచిక - 104 | రూ : 4 | పేజీలు: 8

## భారత్-చైనా సంబంధాలు

# ప్రపంచ శాంతికి కీలకం

- వాంగ్ యీతో భేటీ తర్వాత మోదీ వ్యాఖ్య
- మనం శత్రువులం కాదు.. భాగస్వాములమన్న చైనా మంత్రి
- అరుదైన ఖనిజాల ఎగుమతికి బీజింగ్ అంగీకారం!
- త్వరలో నేరుగా విమాన సర్వీసుల పునరుద్ధరణ



దిల్లీ: ప్రాంతీయ సుస్థిరతకే కాదు.. ప్రపంచ శాంతి, సౌభాగ్యాలకు భారత్, చైనా సంబంధాలు కీలకమని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ.. మంగళవారం ప్రధానితో భేటీ అయ్యారు. సరిహద్దులో శాంతిని ఉమ్మడిగా కాపాడుకోవడం, వాణిజ్యానికి సరిహద్దుల్ని మళ్లీ తెరవడం, వివిధ రకాల వీసాలకు వెసులుబాటు కల్పించడం, పెట్టుబడుల వెల్లువను ప్రోత్సహించడం, నేరుగా విమాన సర్వీసులను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడం, నదీ జలాల పంపకంలో సహకరించుకోవడంపై ఉభయపక్షాలు సుముఖత వ్యక్తం చేశాయి. భారత్‌పై వాణిజ్య సుంకాలను అమెరికా ఎడాపెడా పెంచేస్తున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత్ చైనా సంబంధాలు స్థిరంగా పురోగతి

తరువాయి 2లో



## రిషి సునాక్‌కు హత్య బెదిరింపులు..

# యువకుడికి జైలు శిక్ష

2లో



2లో

## కాళేశ్వరం కమిషన్ నివేదిక..

### హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

- జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను కొట్టివేయాలని కోరుతూ పిటిషన్లు
- పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదన్న కేసీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపణ



## నేరం చేస్తే..

# ప్రధానికైనా ఉద్వాసనే..!

- నేడు పార్లమెంటులో బిల్లు
- జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ!

2లో

## మా అత్త గారి తర్వాత

# ఆవిడే మా కుటుంబ పెద్ద

- నందమూరి కుటుంబంలో విషాదం
- ఎన్టీఆర్ పెద్ద కోడలు పద్మజ కన్నుమూత
- పద్మజ భౌతికకాయానికి నివాళులు అర్పించిన సీఎం చంద్రబాబు

2లో



## చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లకు

# విజ్ఞప్తి చేస్తున్నా..

### : రేవంత్ రెడ్డి కీలక సూచన

- ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగువాడిని గెలిపించుకుందామని పిలుపు
- పీవీ తర్వాత తెలుగువాడిని కీలక పదవిలో కూర్చుండబెట్టే అవకాశం వచ్చిందని వ్యాఖ్య
- తెలుగు రాష్ట్రాలకు చెందిన పార్టీలు ఇండియా కూటమి అభ్యర్థికి మద్దతివ్వాలని విజ్ఞప్తి



2లో



## ఓ వ్యక్తి తిరుమల శ్రీవారికి

### 121 కిలోల బంగారం ఇస్తున్నాడు

- మంగళగిరిలో పీ4 సభ
- హాజరైన సీఎం చంద్రబాబు
- ఓ అజ్ఞాత భక్తుడి గురించి వెల్లడించిన వైనం

2లో

## 'ఆ ఫేక్ యాప్‌తో జాగ్రత్త'..

# బలగాలకు 'సీఆర్పీఎఫ్' అలర్ట్



2లో

# సింధు జలాల ఒప్పందం

### : నెహ్రూపై మరోసారి విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

2లో



# నేరం చేస్తే ప్రధానికైనా ఉద్వాసనే!

శ్రీనగర్: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్ర పాలిత ప్రాంత ముఖ్యమంత్రిని; రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుందని వెల్లడించాయి. కనీసం అయిదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెలరోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న మంత్రుల్ని తొలగించడానికి రాజ్యాంగంలో ఇంతవరకు నిబంధనలు లేవని బిల్లు ముసాయిదా పేర్కొంటోంది. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీలు గతంలో అరెస్టైనా తమ పదవులకు రాజీనామా చేయని విషయం తెలిసిందే. ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని అరెస్టు చేయించి, అస్థిరపరచడానికే కేంద్రం ఈ బిల్లును తీసుకువస్తోందని కాంగ్రెస్ మండిపడుతోంది. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో మొత్తం నాలుగు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారన్న ఊహాగానాలు కూడా ఊపందుకున్నాయి. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు2025, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ (సవరణ) బిల్లు 2025, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2025, ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహం.. నియంత్రణ బిల్లు 2025లను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారని అభిజ్ఞవర్గాలు తెలిపాయి. కొన్ని బిల్లుల్ని సంయుక్త పార్లమెంటరీ సంఘాలకు నివేదించనున్నట్టు లోక్‌సభ ఎజెండా చెబుతోంది. కొత్తగా ప్రవేశపెట్టనున్న జమ్మూకశ్మీర్ బిల్లు ఆ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పిస్తుందా అనే ఊహాగానాలకు ఊతమిచ్చింది.

**ఆన్‌లైన్ గేమింగ్ ఇక నేరమే**

ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నేరంగా పరిగణించే 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. దీనిని బుధవారం పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఆన్‌లైన్ గేమ్స్, ఈస్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్నవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు.

## భారత్‌చైనా సంబంధాలు
# ప్రపంచ శాంతికి కీలకం

(మొదటిపేజీ తరువాయి)

సాధిస్తున్నాయని ఈ సమావేశానంతరం మోదీ వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో)లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కలిసేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. సరిహద్దులో శాంతి నెలకొనడం కీలకమని వాంగ్ యీతో భేటీలో మోదీ స్పష్టం చేసినట్లు పీఎంవో ఒక ప్రకటనలో తెలిపింది. సరిహద్దు వివాదానికి అంగీకారయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు నిబద్ధతతో ఉన్న విషయాన్ని ప్రధాని పునరుద్ఘాటించినట్లు పేర్కొంది. సరిహద్దుపై 24వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చల్లో భాగంగా వాంగ్ యీ.. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో అంతకుముందు సమావేశమయ్యారు. భారత్‌చైనాలు శత్రువులు కాదని, భాగస్వాములని చైనా మంత్రి పేర్కొన్నారు. భారత్‌చైనా సంబంధాలు గత 9 నెలల్లో మెరుగుపడ్డాయని, సరిహద్దులో శాంతి నెలకొందని పేర్కొన్నారు. వాంగ్ యీ పర్యటనలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొన్ని నెలలుగా భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువుల ఎగుమతులను నిలిపివేసిన చైనా.. వాటిని పునరుద్ధరించడానికి అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో సోమవారం జరిగిన సమావేశంలో వాంగ్ యీ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇది కార్యరూపం దాలిస్తే గత కొన్నాళ్లుగా ఈ దిగుమతులు నిలిచిపోవడంతో ఇబ్బందిపడుతున్న ఆటోమొబైల్, ఇతర పరిశ్రమలకు భారీ ఊరట లభించినట్లే. చైనాలో తైవాన్ భాగమని వాంగ్‌యీ, జైశంకర్ మధ్య సోమవారం జరిగిన చర్చల్లో భారత్ పేర్కొన్నట్లు వచ్చిన కథనాలను భారత ప్రభుత్వ వర్గాలు ఖండించాయి.

## రిషి సునాక్‌కు హత్య బెదిరింపులు.. యువకుడికి జైలుశిక్ష



**బ్రిటన్ :** బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్‌పై జాత్యాహంకార బెదిరింపులకు పాల్పడిన ఓ 21 ఏళ్ల యువకుడికి స్థానిక కోర్టు జైలుశిక్ష విధించింది. ఈ రోజుల్లో ఇలాంటి వివక్షతకు ఎక్కడా చోటు లేదని స్పష్టం చేసింది. క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కన్‌హెడ్‌కు చెందిన లియామ్ షా గతేడాది జూన్‌లో రిషి సునాక్‌కు జాత్యాహంకార హత్యా బెదిరింపులతో కూడిన రెండు ఈమెయిళ్లు పంపాడు. ఆ సమయంలో సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. ఆయన వ్యక్తిగత సహాయకుడు వాటిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే సెప్టెంబరులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. విచారణ క్రమంలో.. మెయిళ్లు పంపినట్లు తనకు గుర్తే లేదని, ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్నట్లు అతడు పేర్కొన్నాడు. అయితే, గత నెల కోర్టు ముందు హాజరైన సందర్భంలో తన నేరాన్ని అంగీకరించాడు. ఈ క్రమంలోనే గత బుధవారం కోర్టు అతడికి 14 వారాల జైలుశిక్ష విధించింది. 20 రోజులు పునరావాస కేంద్రంలో గడపాలని, మాదకద్రవ్యాల రిహాబిలిటేషన్ కోర్సును కూడా పూర్తి చేయాలని ఆదేశించింది. అదేవిధంగా రెండేళ్లపాటు రిషి సునాక్‌కు, ఆయన కార్యాలయానికి దూరంగా ఉండాలని పేర్కొంది. "ప్రజాప్రతినిధితో నేరుగా సంప్రదించే సౌకర్యమనేది ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లాంటిది. దాన్ని దుర్వినియోగం చేయడం.. ప్రజాస్వామ్య ప్రక్రియకు హాని కలిగిస్తుంది" అని కోర్టు తన తీర్పు సమయంలో వ్యాఖ్యానించింది. అయితే, జైలుశిక్ష అమలును ఏడాది కాలానికి నిలిపేసింది.

## కాళేశ్వరం కమిషన్ నివేదిక...
# హైకోర్టులో కేసీఆర్, హరీశ్ రావు పిటిషన్లు

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ పిటిషన్లు హైకోర్టు రిజిస్ట్రీ పరిశీలనలో ఉన్నాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌కు విచారణార్హత లేదని, ఆ కమిషన్ సమర్పించిన నివేదికను కొట్టివేయాలని వారు కోరారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తమ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కేసీఆర్, హరీశ్ రావు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని వారు ఆరోపించారు. ప్రభుత్వానికి ఏది కావాలో కమిషన్ నివేదిక ఆ విధంగా ఉందని వారు పేర్కొన్నారు. కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ సమర్పించిన నివేదికకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. విచారణకు సంబంధించిన వివరాలను కమిషన్ విశ్లేషణాత్మకంగా నివేదికలో పొందుపరిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నివేదికను త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెడతామని, అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# సింధు జలాల ఒప్పందం: నెహ్రూపై మరోసారి విరుచుకుపడ్డ ప్రధాని మోదీ

* **సింధు జలాల ఒప్పందం నెహ్రూ చేసిన చారిత్రక తప్పిదం అన్న ప్రధాని మోదీ**
* **దేశాన్ని నెహ్రూ రెండుసార్లు విభజించారని తీవ్ర విమర్శలు**
* **ఒప్పందం వల్ల రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపణ**
* **మోదీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన ప్రియాంక గాంధీ**
* **గతాన్ని వదిలి ప్రస్తుత సమస్యలపై మాట్లాడాలని కాంగ్రెస్ డిమాండ్**

**ఢిల్లీ :** భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. సింధు నదీ జలాల ఒప్పందం విషయంలో నెహ్రూ చారిత్రక తప్పిదానికి పాల్పడ్డారని, తద్వారా దేశ రైతాంగానికి తీరని అన్యాయం చేశారని ఆరోపించారు. మంగళవారం జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ సమావేశంలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ లైబ్రరీ భవనంలో జరిగిన ఈ సమావేశంలో మోదీ మాట్లాడుతూ, "నెహ్రూ దేశాన్ని ఒకసారి కాదు, రెండుసార్లు విభజించారు. మొదట రాడ్‌క్లిఫ్ లైన్‌తో, ఆ తర్వాత సింధు జలాల ఒప్పందంతో దేశానికి నష్టం చేకూర్చారు" అని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కింద సింధు నది జలాల్లో 80 శాతం నీటిని పాకిస్థాన్‌కు ధారాదత్తం చేశారని ఆయన మండిపడ్డారు. ఆ తర్వాత తన కార్యదర్శి వద్ద ఈ ఒప్పందం వల్ల ఎలాంటి ప్రయోజనం కలగలేదని నెహ్రూ స్వయంగా తన తప్పును అంగీకరించారని మోదీ తెలిపారు. ఈ ఒప్పందం పూర్తిగా రైతు వ్యతిరేకమని ఆయన అభివర్ణించారు. రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యపు హక్కును కాలరాసేందుకు నెహ్రూ హయాంలో రాజ్యాంగ సవరణ చేశారని మోదీ మండిపడ్డారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా నియోజకవర్గాల సంఖ్యను పెంచారని విమర్శించారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కృషి చేయలేదని, తమ ప్రభుత్వం వచ్చాకే వారి అభివృద్ధి మొదలైందని అన్నారు. ఎన్డీయే హయాంలో దేశం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోందని అన్నారు.

* **నెహ్రూను నిందించడం అలవాటుగా మారింది: ప్రియాంక**

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికే పదేపదే నెహ్రూను నిందిస్తోందని ఆమె విమర్శించారు. "గతాన్ని పదేపదే తవ్వడం మానేసి, వర్తమానంలో జరుగుతున్న విషయాలపై సమాధానం చెప్పాలి. ఓట్ల దొంగతనం ఆరోపణలపై ఎందుకు మౌనంగా ఉన్నారు? ప్రజలకు జవాబుదారీగా ఉండాలి" అని పార్లమెంట్ వెలుపల మీడియాతో మాట్లాడుతూ ప్రియాంక డిమాండ్ చేశారు.

## చంద్రబాబు, జగన్, పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నా : రేవంత్ రెడ్డి కీలక సూచన

**హైదరాబాద్:** "చంద్రబాబు, కేసీఆర్, జగన్, పవన్ కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేస్తున్నా. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో తెలుగు వాడిని గెలిపించుకుందాం" అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. పీవీ నరసింహారావు తర్వాత తెలుగు వ్యక్తిని కీలక పదవిలో కూర్చోబెట్టే అవకాశం వచ్చిందని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు 'ఇండియా' కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలో రాజ్యాంగ వ్యవస్థలను ఎన్డీయే దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతున్న కూటమి ఒకవైపు, రాజ్యాంగాన్నే రద్దు చేయాలని చూస్తున్న కూటమి మరోవైపు ఉందని ఆయన అన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఏకతాటిపైకి వచ్చి 'ఇండియా' కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. టీడీపీ, వైసీపీ, బీఆర్‌ఎస్, మజ్లిస్ సహా అన్ని పార్టీలు జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. రాజకీయాలకు అతీతంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఆనాడు ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు ఎన్టీఆర్ మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. నంద్యాల ఉప ఎన్నికల్లో పీవీపై పోటీ పెట్టకుండా గెలిపించారని తెలిపారు. తెలుగు వ్యక్తి అత్యున్నత స్థానంలో ఉండాలనే భావనతో ఎన్టీఆర్ సహకరించారని తెలిపారు. ఇప్పుడు మరోసారి తెలుగు నేతలంతా ఎన్టీఆర్ స్ఫూర్తిగా సహకరించాలని ముఖ్యమంత్రి అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి రైతు కుటుంబం నుంచి వచ్చారని, న్యాయమూర్తిగా, లోకాయుక్తగా దేశానికి సేవలు అందించారని తెలిపారు.

# 'ఆ ఫేక్ యాప్‌తో జాగ్రత్త'.. బలగాలకు 'సీఆర్పీఎఫ్' అలర్ట్

ఢిల్లీ : ఓ అనధికారిక యాప్ విషయంలో సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ అప్రమత్తమైంది. సీఆర్పీఎఫ్‌కు చెందిన ప్రామాణిక ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకదానిని అనుకరించేలా ఆ యాప్ ఉందని పేర్కొంది. సిబ్బంది వ్యక్తిగత, సంస్థాగత వివరాలను సేకరించడం ద్వారా అది భద్రతాపరంగా తీవ్రమైన ముప్పును కలిగించే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా వ్యవహరించాలంటూ 3.25 లక్షల మంది సిబ్బందికి సూచించింది. 'సంభవ్ అప్లికేషన్ రైటర్' పేరిట ఓ యాప్‌పై వాట్సప్, యూట్యూబ్ సహా ఆయా ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో ప్రచారం జరుగుతోందని సీఆర్పీఎఫ్ ఐటీ విభాగం అడ్వైజరీ జారీ చేసింది. ఆ అప్లికేషన్‌ను తాము రూపొందించలేదని, వినియోగానికి కూడా సిఫార్సు చేయలేదని ఓ అధికారి తెలిపారు. ఆన్‌లైన్ ప్లే స్టోర్‌ల నుంచి దాన్ని తొలగించాలని ప్రభుత్వ సైబర్ భద్రతాసంస్థలను కోరినట్లు వెల్లడించారు. 'సీఆర్పీఎఫ్ సంభవ్' పేరిట అసలైన యాప్ వినియోగంలో ఉంది. బలగాలు, ఇతర సిబ్బంది వేతనాలు, సెలవులు, బదిలీలకు అర్హత వంటి వ్యక్తిగత, అడ్మినిస్ట్రేటివ్ వివరాలను పరిశీలించేందుకు దాన్ని ఉపయోగిస్తారు. అయితే.. 'సంభవ్ అప్లికేషన్ రైటర్' పేరిట చక్కర్లు కొడుతున్న నకిలీ యాప్.. సిబ్బందికి ఉపయుక్తంగా ఉంటుందని చెబుతూ వారి వివరాలు అడుగుతోందని సీఆర్పీఎఫ్ తన అడ్వైజరీలో పేర్కొంది. ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసింది.

## ఓ వ్యక్తి తిరుమల శ్రీవారికి 121 కిలోల బంగారం ఇస్తున్నాడు..

**మంగళగిరి:** కలియుగ దైవం తిరుమల వెంకటేశ్వర స్వామికి ఓ అజ్ఞాత భక్తుడు అత్యంత భారీ విరాళాన్ని సమర్పించనున్నారు. ఏకంగా 121 కిలోల మేలిమి బంగారాన్ని స్వామివారికి కానుకగా ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. ఈ ఆసక్తికర విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వెల్లడించారు. మంగళగిరిలో మంగళవారం జరిగిన 'పీ4' (ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం) కార్యక్రమంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, ఆ అజ్ఞాత భక్తుడి గురించి కొన్ని వివరాలు పంచుకున్నారు. "నాకు బాగా తెలిసిన ఒక భక్తుడు ఉన్నారు. ఆయన ఒక కంపెనీ పెట్టాలనుకుని, ఎంతో కష్టపడి స్థాపించారు. వ్యాపారంలో విజయవంతం అయ్యారు. ఇటీవల తన కంపెనీలోని 60 శాతం వాటాను విక్రయించారు. దాని ద్వారా ఆయనకు సుమారు 1.5 బిలియన్ డాలర్లు, అంటే మన కరెన్సీలో దాదాపు 1306 కోట్ల రూపాయలు వచ్చాయి" అని తెలిపారు. "ఈ సంపద అంతా తనకు ఆ వెంకటేశ్వర స్వామి దయ వల్లే వచ్చిందని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. అందుకే స్వామివారికి తిరిగి కృతజ్ఞతగా ఏదైనా సమర్పించుకోవాలని భావించారు. ఈ క్రమంలోనే 121 కిలోల బంగారాన్ని విరాళంగా ఇస్తున్నారు. దీని విలువ సుమారు రూ. 150 కోట్లు ఉంటుంది. అయితే, తన పేరును ఎక్కడా బయటపెట్టవద్దని ఆయన ఒక లేఖ ద్వారా స్పష్టంగా కోరారు" అని చంద్రబాబు వివరించారు. ఈ విరాళం గురించి మరిన్ని ఆసక్తికర విషయాలను చంద్రబాబు పంచుకున్నారు. "సాధారణంగా తిరుమలలో స్వామివారికి రోజుకు సుమారు 120 కిలోల ఆభరణాలు అలంకరిస్తారు. యాదృచ్ఛికంగా ఈ భక్తుడు కూడా 121 కిలోల బంగారం ఇస్తున్నారు. బహుశా ఈ విషయం ఆయనకు తెలిసి ఉండకపోవచ్చు. ఒకే వ్యక్తి ఇంత పెద్ద మొత్తంలో విరాళం ఇస్తున్నారంటే, అది ఆయనకు దేవుడిపై ఉన్న అపారమైన నమ్మకానికి నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ఈ నెల 13న అల్పపీడనం... ఏపీకి భారీ వర్ష సూచన

* **ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన**
* **శనివారం ఆరు జిల్లాల్లో పిడుగులతో కూడిన వానలు**
* **ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు**
* **వచ్చే బుధవారానికి బంగాళాఖాతంలో అల్పపీడనం**
* **ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల శాఖ సూచన**



ఈ నెల 13వ తేదీ (వచ్చే బుధవారం) నాటికి వాయవ్య, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈ అల్పపీడనం ఏర్పడేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) స్పష్టం చేశాయి. దీని ప్రభావంతో ఏపీలో విస్తారంగా, పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించాయి. మరో వైపు ద్రోణి ప్రభావంతో రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా రేపు (శనివారం) ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడతాయని హెచ్చరించారు. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదవుతాయని పేర్కొన్నారు.

# ఆగస్టు 22 ఛలో ప్రజా భవన్ కు వేలాదిగా కదిలి రావాలి

* **జేఏసీ నాయకుల పిలుపు.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 36 వేల మంది కాంట్రాక్టు కార్మికుల జీవితాలతో చెలగాట మాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం వెంటనే కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 22న చలో ప్రజా భవన్ కు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కాంట్రాక్టు కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సీఐటీయూ కార్యాలయంలో సమావేశం అయ్యారు. జేఏసీ నాయకులు కే బ్రహ్మచారి మల్లెల రామనాథం కరుణాకర్ గోపాల్ రావు భూక్య రమేష్ రవి మాట్లాడారు. మంగళవారం ఉదయం నుండి సాయంత్ర వరకు సింగరేణి ఏరియా , కార్పోరేట్ పని ప్రాంతాలలో కార్మికుల వద్ద విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. గత అనేక సంవత్సరాల నుండి కల్లబొల్లి మాటలు చెబుతూ కాంటాక్ట్ కార్మికులకు అన్యాయం చేస్తున్న పద్ధతిని వ్యతిరేకిస్తూ కాంట్రాక్టు కార్మికులకు వెంటనే కనీస వేతనం 26,000 అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 22 ని అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. కనీస వేతనాల అమలు సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ బుట్ట దాఖలు చేసే విధంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ పట్టనట్టుగా వివరిస్తున్నారని విమర్శించారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న శ్రమ వల్లనే సింగరేణి సంస్థ రక్షించబడుతుందని అభివృద్ధి బాటలో నడుస్తుందని పర్మినెంట్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్న సింగరేణి




కాంట్రాక్టు కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చూస్తూ ఉండమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు కే బ్రహ్మచారి , కరుణాకర్, మల్లెల రామనాథం, భూక్యా రమేష్, విజయ్ , గిరిబాబు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు




ప్రజాస్ఫూర్తి, కాప్రా : ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం కాప్రా సర్కిల్‌లోని లయన్స్ క్లబ్ బిల్డింగ్ కమలనగర్ నందు ఫోకస్ ఫోటోగ్రఫీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్లు తమ అనుభవాలను పంచుకుని, ఫోటోగ్రఫీ వృత్తి మాత్రమే కాకుండా సమాజానికి ఉపయోగపడే కళగా కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కేవలం జీవనాధారం మాత్రమే కాకుండా భావోద్వేగాలను, సమాజంలో జరుగుతున్న మార్పులను సజీవంగా నిలిపే ఒక శక్తివంతమైన సాధనం అని పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ యువత ఫోటోగ్రఫీని కేవలం వృత్తిగా కాకుండా సృజనాత్మక కళగా తీసుకొని అభివృద్ధి సాధించాలని సూచించారు. జనరల్ సెక్రటరీ నరేష్, ట్రెజరర్ శివనారాయణ, జాయింట్ సెక్రటరీ కన్నా కూడా ఫోటోగ్రఫీ ప్రాధాన్యతపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ప్రకాశ్, దాస్, హరి, రాము గౌడ్, మోహన్, శంకర్, శ్రవణ్, లోవేష్, శ్రీనివాస్, మధు, శేఖర్, గౌస్ భాయి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఆపదలో అండగా...

* **ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా భరోసా:**
* **పేద ప్రజల సంక్షేమమే ధ్యేయం:కొలన్:**



ప్రజాఫూర్తి, కుత్బుల్లాపూర్ : పేద ప్రజల సంక్షేమ ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి అన్నాడు. నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో వున్న పేదలు అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందుతూ చికిత్సకు సరిపడా స్థోమత లేకపోవడంతో వారి పరిస్థితిని కొలన్ హన్మంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు వెంటనే స్పందించిన ఆయన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ని మంజూరు చేయించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డివిజన్ కుత్బుల్లాపూర్ ఎన్టీఆర్ నగర్ వాసులు కుర్వ రంగన్నకు రూ.36,500, సూరారం కాలనీ వాసులు ఆకుల డానియల్ కు రూ.25,000, గాజులరామారం వసూలు పి.నాగేష్ కు రూ.37,500 ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులు అందజేశారు. అనంతరం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ఎంతో మేలు చేకూరుతుందని, అనారోగ్యం బారిన పడిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా మారిన గడ్డర్ ను పరిశీలించిన కార్పొరేటర్



శేర్లింగంపల్లి, ప్రజాస్ఫూర్తి : శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్లో గల వడ్డేపల్లి ఎంక్లేవ్ పక్కన నాలా మీదుగా మాధవరం నగర్ కాలనీకి ఏర్పాటు చేసిన లింక్ రోడ్ పైన గడ్డర్ ను ఒక ఆటో డీ కొట్టడం తో గడ్డర్ వంగిపోయి పడిపోయే ప్రమాద స్థితిలో ఉంది. విషయం తెలిసిన వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు మంగళవారం ఏ ఈ నిఖిల్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల దృశ్య గడ్డర్ ఏ క్షణానైనా పడిపోయే ప్రమాదం ఉన్నందువలన ముందస్తు చర్యలుగా అక్కడి రోడ్డు పైన రాకపోకలు ఆపేసి గడ్డర్ మరమత్తు పనులు వీలైనంత త్వరగా చేపట్టి వాహనదారుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను కోరారు.



## విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

మేడ్చల్ ప్రతినిధి, ప్రజాస్ఫూర్తి : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. మంగళవారం కీసర మండలం అంకిరెడ్డి పల్లిలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ లకు నిర్వహిస్తున్న మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీని అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. వంట గది, స్టోర్ ను పరిశీలించి, వంట పదార్థాలపై ఎలాంటి పురుగులు, దోమలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, మూతలు ఉంచాలని, భోజనం పూర్తి నాణ్యతగా వండి వడ్డించాలని, ఆహారం కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య లోపం, ఆహారం కలుషితం వంటి కారణాల వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురి కాకూడదని తెలిపారు. విద్యార్థులు వ్యక్తి గత పరిశుభ్రతను పాటించాలన్నారు పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పాఠశాల ప్రిన్సిపాల్ ను, ఉపాధ్యాయులను ఆదేశించారు. స్కూల్, కాలేజీ స్ట్రేంత్ ఎంత మంది విద్యార్థులున్నారని, బిల్డింగ్ అద్దె ఎంత చెల్లిస్తున్నారని ప్రిన్సిపల్ ను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులలో తిరిగి విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో మీరేం అవుతారని, మీ ఆశయం ఏమిటని అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించే మంచి మాటలు విద్యార్థులకు తెలిపారు. మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, స్నాక్స్ అందిస్తూన్నారా అని ఆరా తీశారు. అనంతరం స్టోర్ లోని వంట సామాగ్రిని పరిశీలించి ఎక్స్పైరీ డేట్ ఎప్పటికప్పుడు చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో ప్రిన్సిపల్ రాజమణి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి

- **7వ వార్డు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు...**

అందోలు, ప్రజాస్ఫూర్తి: మానవాళి మనుగడ కోసం మొక్కలు నాటడం ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని అందోల్ జోగిపేట మున్సిపాలిటీ 17వ వార్డు మాజీ కౌన్సిలర్ చిట్టిబాబు అన్నారు. మంగళవారం ఇంటింటికి తిరుగుతూ వార్డు ప్రజలకు ఐదు రకాల మామిడి, ఉసిరి, జామ, గులాబీ,వంటి మొక్కలను పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయాన మాట్లాడుతూ చెట్లు పెంచితే పచ్చదనంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని తెలిపారు. ప్రకృతికి సహజ సిద్దంగా ఉండే విధంగా మొక్కలు పెంచాలన్నారు. రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. ప్రజలు వనమోత్సవంలో పాల్గొని ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా మొక్కలు నాటి వన మహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు.



## బంగారం, వెండి దుకాణాల యజమాన్యాలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

* **డీఎస్పీ చంద్రభాను**

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: బంగారం, వెండి దుకాణాల యజమాన్యాలు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఇల్లందు డి.ఎస్.పి చంద్రభాను అన్నారు మంగళవారం ఇల్లందులో ఉన్నటువంటి యజమాన్యానికి భద్రత భద్రతపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి ప్రతి దుకాణానికి వీలైనంతవరకు ఒక వాచ్మెన్ ని ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో బంగారం, వెండి దుకాణాల ప్రెసిడెంట్ అద్దంకి రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ ఆకారపు రవి, అరుణ్ తివారి, శ్రీను,ట్రెజరర్ అనిల్ గోయల్, సునీల్ తివారి, అనిల్ తివారి, సుందరాచారి, ఇమ్రాన్, సతీష్, దత్త, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాస్ఫూర్తి ఎఫెక్ట్


ప్రజా ప్రభుత్వంలో అధికారుల మొద్దు నిద్ర

* ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్
* పొంచి ఉన్న ప్రమాదం
* ఇబ్బందులు పడుతున్న స్థానికులు
* సారూ సమస్య పరిష్కరించండి అంటున్న స్థానికులు:

ప్రజా స్ఫూర్తి, జగద్గిరిగుట్ట: కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజా సమస్యలను గాలికొదిలేస్తున్న కొందరు అధికారుల నిర్లక్ష్య దోరణితో ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా జగద్గిరిగుట్టలో జలమండలి అధికారుల పని తీరుపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లాస్ట్ బస్టాప్ నుండి శ్రీనివాస్ నగర్ వెళ్లే ప్రధాన రహదారిలో కిడ్స్ కేర్ హాస్పిటల్ ఎదురురుగా మ్యాన్ హోల్ ధ్వంసమై మూత లేకుండా ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించేఈ రహదారిలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపిల్లలు మ్యాన్ హోల్ లో పడే ప్రమాదం పొంచి ఉందని వారం రోజులుగా సమస్య ఇదే స్థితిలో వున్నా వాటర్ వర్క్స్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మ్యాన్ హోల్ నుండి మురుగు నీరు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతుండటంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజా ప్రతినిధులైనా, ప్రభుత్వ ప్రతినిధులైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

19 Aug 2025
https://www.prajaspoorthi.com/clip/20980
ప్రజాస్ఫూర్తి PRAJASPOORTHI తెలుగు దినపత్రిక

### వార్తా కథనానికి స్పందన మ్యాన్ హోల్స్ కు మరమ్మత్తులు హర్షం వ్యక్తం చేసిన స్థానికులు



ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట:సోమయ్య నగర్ కిడ్స్ కేర్ హాస్పిటల్ ఎదురుగా ప్రధాన రహదారిలో మ్యాన్ హోల్ ప్రమాదకరంగా మారింది. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, సమస్యను వెలుగులోకి తెచ్చేలా మంగళవారం "ప్రజా పాలనలో అధికారుల మొద్దు నిద్ర"అనే శీర్షికన ప్రజా స్ఫూర్తిదినపత్రిక లో వెలువడిన కథనానికి అధికారులు స్పందించారు.జలమండలి అధికారుల ఆదేశాలతో మంగళవారం ఉదయం సిబ్బంది మ్యాన్ హోల్ మరమ్మతు పనులు చేసారు.వారం రోజులుగా డ్రైనేజి సమస్యతో ఇబ్బంది పడ్డామని,తమ సమస్య పరిష్కారం కోసం అధికారుల్లో చలనం వచ్చేలా వార్త కథనం ప్రచురించిన ప్రజాస్ఫూర్తి కి ఈ సందర్భంగా స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ డే



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఫోటో అండ్ వీడియో గ్రాఫిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు కలిసి కేక్ కట్ చేసి ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తరువాత ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ, ఫోటోగ్రఫీ ప్రాధాన్యతపై ఆలోచనలు పంచుకున్నారు.

## ఫొటోగ్రఫీ డే సందర్భంగా.. రజువాకు మొక్కను అందించిన రాజశేఖర్



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రపంచ ఫోటోగ్రఫీ డే సందర్భంగా కొత్తగూడెంకు చెందిన సీనియర్ ఫోటో జర్నలిస్ట్ దశరథ్ రజువాకు ప్రకృతి ప్రేమికుడు, గ్రీన్ మోటర్ వెహికల్ గార్డెన్ వ్యవస్థాపకుడు, సింగరేణియన్ మన్ కీ బాత్ కొట్టూరు నుర్వి రాజశేఖర్ (మొక్కల రాజశేఖర్) శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం స్వయంగా రజువాను కలిసి మొక్కను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ పత్రికా రంగంలో ఫోటో జర్నలిస్టుగా పనిచేస్తూ తాను తీసిన ఫోటోల ప్రజల సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని, అదేవిధంగా కరోనా సమయంలో ఆదివాసీల 'ఆకుల మాస్క్' ఫొటోతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారని కొనియాడారు. భవిష్యత్తులోనూ దశరథ్ రజువా తన ఫోటోగ్రఫీ ద్వారా ప్రజలకు మేలు చేయాలని రాజశేఖర్ ఆకాంక్షించారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

*** ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు**



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు అన్నారు మంగళవారం షాపూర్ నగర్ లోని పొట్లూరి నాగేశ్వరరావు భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని గాజులరామారం మహారాజ గార్డెన్లో ఆగస్టు నెల 20,21,22, సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఉంటాయని తెలంగాణ రాష్ట్రం నుండి దాదాపు 1000 మంది పైగా ప్రతినిధులు సమావేశంలో పాల్గొంటారని అన్నారు రాజకీయ, ప్రభుత్వ పాలన అనుకూలంగా ఉన్నాయా వ్యతిరేకంగా ఉన్నాయని విశ్లేషణలు ఉంటాయని అదేవిధంగా ప్రభుత్వానికి సంబంధించి ప్రజల ఉద్యమాలపైన పార్టీలను కలుపుకొని పోవాలా ఎన్నికలలో కొనసాగే విధి విధానాల పై సమావేశాలు ఉంటాయని ప్రజలను కలుపుకొని పోయే పార్టీల పట్ల సభలో చర్చించుకుంటామని గ్రామ, మండల, జిల్లా రాష్ట్రంలో పార్టీ బలోపేతనంపై విశ్లేషణలు ఉంటాయని ఈ రాష్ట్రంలో కనీస వేతనాలపై ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై సమావేశాలు ఉంటాయని భవిష్యత్తు కార్యచరణలు ప్రకటిస్తామని మూడు సంవత్సరాలకో సరి సిపిఐ మహాసభలు ఉంటాయని కమ్యూనిస్టు పార్టీ అంటే సమాజం దశదిశలు మార్చగల పార్టీ అని అన్నారు ప్రతి ఒక్కరు ఈ మహాసభలు విజయవంతం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు హేమంతరావు కొత్తగూడెం కార్యదర్శి సాబీర్ పాషా జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం.డి యూసుఫ్ కార్యనిర్వాహణ అధ్యక్షులు కే. యేసురత్నం,మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఈ. ఉమా మహేష్, కోశాధికారి కే.స్వామి కార్యవర్గ సభ్యులు వి.హరినాధరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 29 నుండి మండల స్థాయి క్రీడోత్సవాలు

**: ఎంఈఓ చందా రమేష్**



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ఈనెల 29వ తేదీ నుండి మూడు రోజులపాటు 69వ, పాఠశాల క్రీడా సమాఖ్య - రాజాపేట మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయని ఎంఈఓ చందా రమేష్ తెలిపారు. మంగళవారం రాజాపేట ఎంఆర్సి భవనంలో
రాజాపేట మండల విద్యాశాఖాధికారి చందా రమేష్ అధ్యక్షతన మండల వ్యాయామ విద్య ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణ, బాధ్యతలు షెడ్యూల్‌ను ఖరారు చేసి వెల్లడించారు, ఆగస్టు 29న - అండర్-14 & అండర్-17 బాలికల కబడ్డీ, ఖో ఖో, వాలీ బాల్ ఆటల పోటీలు, ఆగస్టు 30 తేదీ - అండర్-14 & అండర్-17 బాలుర కబడ్డీ, ఖో ఖో, వాలీ బాల్ ఆటల పోటీలు, సెప్టెంబర్ 1న, - అండర్-14 & అండర్-17 బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని వివరించారు. అండర్-14 విద్యార్థులు 1 జనవరి 2012 తర్వాత జన్మించిన వారు ఉండాలని, అండర్-17 వారు 1 జనవరి 2009 తర్వాత జన్మించిన వారుండాలన్నారు. రాజపేట గురుకుల పాఠశాల మైదానంలో క్రీడలు జరుగుతాయని, సంబంధిత మండల పాఠశాలల వ్యాయామవిద్య ఉపాధ్యాయులు, యాక్టివ్ టీచర్లు ఆగస్టు 27వ, తేదీ సాయంత్రం 5:00 లోపు పార్టిసిపేషన్ వివరాలు మండల ఇన్‌ఛార్జి పిడి మధుకి (9848584735) పంపించాలని ఎంఈఓ చందా రమేష్ కోరారు. ఆగస్టు 28న డ్రా తీయబడతుందని, క్రీడల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి దగ్గర ప్రధానోపాధ్యాయులు సర్టిఫై చేసిన బోనఫైడ్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యాయామ ఉపాధ్యాయులు నాతి కృష్ణమూర్తి, సంపత్, వరలక్ష్మి, ప్రభ, వెంకటేశ్వర్లు, ఆశా బేగం, శిరీష, శృతి తదితరులు పాల్గొన్నారు.

## గంధమల్ల చెరువుకు పూజలు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట ప్రజా స్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువు కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ మధ్య కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండి మత్తడిలు దుకుతున్నాయి. తుర్కపల్లి మండలంలో అతి పెద్ద చెరువు గంధమల్ల కూడా అలుగు పారుతుంది ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మకు,చీర,కునుకుమ్మ, పసుపు పసుపు సమర్పించి, హారతులిచ్చి, కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షం లేని సమయంలో నగముల చెరువును నింపడం దానితోపాటు మిగతా చర్యలను నింపడం జరిగిందని ఇప్పుడు వరణ దేవుడు కరుణించి వర్షం సమృద్ధిగా పడి చెరువులన్నీ నిండి అలుగు పారడం జరుగుతుందని ఈ సందర్భంగా రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు..

## యువత సృజనాత్మకతపై దృష్టి పెట్టాలి

*** డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ జి.సతీశ్‌రెడ్డి**

విద్యానగర్ (హనుమకొండ) : ప్రస్తుత సాంకేతిక రంగంలో యువత సమకాలీన సృజనాత్మక ఆవిష్కరణలపై దృష్టి సారించాలని డీఆర్‌డీవో మాజీ ఛైర్మన్ డాక్టర్ జి.సతీశ్‌రెడ్డి సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఉప కులపతి ఆచార్య ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం వర్సిటీ ఆడిటోరియంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సదస్సు ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జి.సతీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో 4.34 కోట్ల మంది విద్యార్థులు ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారని, ఇది కొన్ని దేశాల జనాభా కంటే ఎక్కువని చెప్పారు. ఏటా 1.5 మిలియన్ల మంది ఇంజినీరింగ్ పూర్తిచేస్తున్నారన్నారు. 2016లో కేవలం 458 స్టార్టప్ కంపెనీలు ఉండేవని, ప్రస్తుతం ఆ సంఖ్య 1.75 మిలియన్లకు పెరిగిందన్నారు. ప్రపంచ సాంకేతికతతో పోటీపడే ఆలోచనలతో ఏఐ, ఎంఎల్, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాల్లో అధ్యయనం, పరిశోధనలు చేయాలని సూచించారు.



## ఆశ వర్కర్ల జులై నెల పారితోషికం విడుదల చేయాలి

*** సమ్మె సందర్భంగా ప్రభుత్వం పెంచిన పారితోషికాన్ని అమలుచేయాలి**
*** సిఐటియు జిల్లా నాయకులు లిక్కి బాలరాజు**
*** సిఐటియు ఆధ్వర్యంలో నిరసన**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఆశ వర్కర్ల జులై నెల ఇన్సెంటివ్ విడుదల చేయాలని సిఐటియు జిల్లా నాయకులు లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జులై నెల పెండింగ్ ఇన్సెంటివ్ విడుదల చేయాలని స్థానిక ప్రభుత్వ హాస్పిటల్లో గల పిపి యూనిట్ ముందు ఆశ వర్కర్లు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు అనంతరం మెడికల్ ఆఫీసర్ రిషిత కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు లిక్కి బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నేటికి జూలై నెల పారితోషికాలు రాలేదనీ,పారితోషికాలు రాకపోవడంతో ఆశా వర్కర్లు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారనీ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆశా వర్కర్ల పారితోషికాలను ప్రతి నెల ముగింపు 30వ తేదీలోపు చెల్లించేవారనీ,కానీ ఇప్పుడు ఆశా వర్కర్లకు పారితోషికాలు గతంలో చెల్లించినట్లు సకాలంలో రావడం లేదనీ ఆరోపించారు. దీంతో ఆశా వర్కర్లు అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందనీ అన్నారు. జూలై నెల పారితోషికాలు వెంటనే చెల్లించాలని,ఆగస్టు నెల పారితోషికాలు సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు.
ఆశా వర్కర్లు ఫిక్సిడ్ వేతనం పద్దెనిమిది వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మె సందర్భంగా ప్రభుత్వం పెంచిన పదిహేను వందల ఇన్సెంటివ్ కలిపి జూలై నెల పారితోషికం వేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ టౌన్ అధ్యక్షురాలు గంగ, లత దేవి, సుశీల, లలిత ప్రశాంతి భాగ్య శిరీష నాగమణి ప్రమీల శారద సుజాత రాజమణి తదితరులు పాల్గొన్నారు.



## చెరువులా మారిన విద్యానగర్ ప్రధాన రహదారి

*** అక్రమ కట్టడాల వలన వర్షపు నీరు నిల్వ**
*** ప్రయాణికుల భద్రతను విస్మరించిన అధికారులు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: విద్యానగర్ ప్రధాన రహదారి చెరువును తలపించేలా మారిందని సిపిఎం టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా చింతలచెరువు నుండి వచ్చే నీరు, అలాగే వర్షపు నీరు గోధుమవాగులో కలవాల్సింది. అయితే, డ్రైనేజీ మార్గాలను ఆక్రమించి భవనాలు నిర్మించడంతో నీరు నడిరోడ్డు మీదే నిలిచిపోతుందని ఆయన తెలిపారు. ప్రజల తీవ్ర ఇబ్బందులను పట్టించుకోకుండా పంచాయతీ అధికారులు ఇష్టం వచ్చినట్టు అనుమతులు ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. రహదారిపై నిలిచిన నీటి కారణంగా ప్రయాణికులు తీవ్ర అసౌకర్యం, ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని బాలరాజు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి డ్రైనేజీలను ఆక్రమించిన భవనాలను తొలగించాలని, కొత్త డ్రైనేజీలు నిర్మించి వర్షపు నీరు సక్రమంగా గోధుమవాగులో కలిసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ కమిటీ సభ్యులు మంద నాగకృష్ణ, కే. హెచ్. ప్రసాద్, గడల నరసింహారావు, కొత్తపల్లి రమేష్ బాబు, కోట బాలకృష్ణ, సతీష్, శివ తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : ప్రస్తుత ఆధునిక పోకడలలో ఫోటోగ్రాఫర్ల పరిస్థితి దయనీయంగా మారిందని ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి ఆదుకోవాలని రాజపేట మండల జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఉప్పల రమేష్ కోరారు. మంగళవారం ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రెస్ ఫోటోగ్రాఫర్ రాజపేట మండలం ఫోటో వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు బిర్రు శ్రీనివాసులును చేనేత శాలువతో సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. 5 లక్షల రూపాయల రుణ సదుపాయం కల్పించాలన్నారు. ఫోటో వృత్తిని నమ్ముకున్న వారందరూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ అప్పుల బాధతో తిప్పలు పడుతున్నట్లు ఉప్పల రమేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజపేట మండల ఆర్యవైశ్య సంఘం యువజన విభాగం అధ్యక్షులు నంగునూరు రాజు, శ్రీ వెంకటేశ్వర ఆలయం మఠం వంశపారంపర్య అర్చక స్వాములు మఠంల రామేశ్వర్ దాస్ మహంత్ తదితరులు ఉన్నారు.

## ఈద భాస్కర్ కి నేషనల్ యూనిటీ అవార్డు ప్రధానం



ప్రజా స్ఫూర్తి నల్లగొండ : అంతర్జాతీయ యువజన దినోత్సవ ముగింపు ఉత్సవాలు పురస్కరించుకొని తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ వారి ఆధ్వర్యంలో గౌరవ తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్ , పబ్లిక్ న్యూస్ 24/7 చానల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కోరే యాదగిరి చేతులమీదుగా సోషల్ వర్కర్, చైల్డ్ వెల్ఫేర్ (మేజిస్ట్రేట్) నల్గొండ, అయినటువంటి ఈద భాస్కర్ ని నేషనల్ యూనిటి అవార్డు తో సత్కరించటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ గత 22 సంవత్సరాల నుండి సమాజ మార్పు కోసం శ్రమించటం తో పాటుగా ప్రస్తుతం మన దేశ సంపద అయినటువంటి బాలల సంక్షేమం కోసం గత 5 సంవత్సరాల నుండి నిరంతరం శ్రమిస్తున్న మన భాస్కర్ ను అవార్డు ద్వార సత్కరించటం సంతోషకరమని ఇట్టి జాతీయ ఐక్యత అవార్డును ఒక బాధ్యత గా గుర్తించి జాతీయ సంపద అయినటువంటి బాలలను,వారి సంక్షేమం కోసం అనునిత్యం పాటుపడాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ చైర్మన్ డా||రాజ్ నారాయణ ముదిరాజ్, రామగుండం ఎంఎల్ఏ మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ బొగ్గవరపు దయానంద గుప్తా, విద్యావేత్త కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, శివ కుమార్, పరమేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయ రైతు పొలాన్ని సందర్శించిన వ్యవసాయ అధికారులు



రాజాపేట, ప్రజా స్ఫూర్తి : రాజాపేటకు చెందిన సేంద్రియ రైతు ఠాకూర్ స్వరన్ పాల్ సింగ్ యొక్క ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని మంగళవారం మండల వ్యవసాయ అధికారిణి పద్మజ బృందం సందర్శించారు. పూర్తి సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న వివిధ రకాల పంటల చూసి, రైతు ద్వారా వివరాలు అడిగి తెలుసుకొని ,సంతోషం వ్యక్తం చేశారు. ఏవో వెంట మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు వినీత ,భవ్యత తదితరులు పాల్గొన్నారు.

## ఓయూ 84 వ స్నాతకోత్సవంలో పట్టా పొందిన డాక్టర్ రుక్సానా మొహమ్మద్



యాదాద్రి భువనగిరి ప్రజా స్ఫూర్తి : ఉస్మానియా విశ్వవిద్యాలయం లో ఈ నెల 19 వ తేదీన జరిగిన 84 వ స్నాతకోత్సవంలో నర్సంపేట పట్టణం కి చెందిన డాక్టర్ రుక్సానా మొహమ్మద్ వాణిజ్య శాస్త్ర విభాగం లో పీఎచ్డీ అవార్డు రాష్ట్ర గవర్నర్ ఓయు కులపతి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ శర్మ, భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం చైర్మన్ డాక్టర్ నారాయణన్మ, ఓయు ఉప కులపతి ప్రొఫెసర్ కుమార్ చేతుల మీదగా అందుకున్నారు. డాక్టర్ రుక్సానా మొహమ్మద్ చిన్ననాటి నుండి చదువుల్లో అనేక అవార్డులు రివార్డులు అందుకుని తనలాంటి విద్యార్థులకు మార్గదర్శనం చేయాలనే లక్ష్యంతో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా 2013 లో ఎంపికై ప్రస్తుతం భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె అత్యున్నతమైన విద్యను అభ్యసించి విశ్వ విద్యాలయ స్థాయిలో మంచి గుర్తింపు పొందటం పట్ల నర్సమాపేట పట్టణంలోని పలువురు స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...

* మండల యువజన కాంగ్రేస్ అద్యక్షుడు టి.ప్రవీణ్‌కుమార్

అందోల్, ప్రజాస్ఫూర్తి: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల పట్ల మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే తప్ప బయటకు రాకూడదని ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందోలు మండల యువజన కాంగ్రేస్ అద్యక్షుడు టి. ప్రవీణ్‌కుమార్ ముదిరాజ్ అన్నారు. మరో రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురువనున్నట్లు వస్తున్న వర్తాలపై మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజలు భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న సమయంలో ప్రజలు బయటకు వెళ్లకుండా ఇంట్లోనే



జాగ్రత్తగా ఉండాలని, మండలంలోని ఆయా గ్రామాలలో వరద ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్టులు, రహదారులపై నుండి ప్రజలు దాటవద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండవద్దని తడిగా ఉన్న విద్యూత్ స్థంభాలు తాకవద్దని, ఉదృతంగా ప్రవహిస్తున్న నీటిలో చేపలు పట్టేందుకు ఎవరూ వెళ్లవద్దని సూచించారు. ఇప్పటికే భారీ వర్షాల కారణంగా చెరువులు, కుంటల నిండి అలుగులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయని వరద నీటిని చూసే క్రమంలో దగ్గరకు వెళ్లకూడదన్నారు. అదే విధంగా రైతులు బోరు బావుల దగ్గరికి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. వరద నీళ్లు వెళ్లే లోతైన కాలువలు,వాగులు వంటి లోతైన ప్రదేశాలకు వెల్లకూడదని ముఖ్యంగా గ్రామాల్లో ఉండే లోతైన మురికి కాల్వల సమీపంలోకి చిన్నపిల్లలు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విద్యూత్ స్థంభాలు, చెట్లు విరిగిపడే అవకాశాల ఉంటాయని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత జాగ్రత్తలు తప్పరిసరిగా తీసుకోవాలన్నారు. వర్షాలు, వరదల వల్ల సహాయక చర్యలు చేపట్టేందుకు స్థానిక అ□ధికారులు సిద్ధంగా ఉన్నారని, కానీ అన్నిటికన్నా ముఖ్యంగా ఎవరికి వారు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అత్యవసరమైతే ఏదైనా సంఘటన జరిగితే స్థానిక అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు పొందాలని కోరారు. ప్రభుత్వం భారీ వర్షాల పట్ల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులను అప్రమత్తం చేసిందని ఏదైనా అత్యవసరం అయితే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.



# గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ పై దృష్టి సారించాలి

* ఎమ్మెల్యే కోరం కనకయ్య

ప్రజాస్ఫూర్తి ఇల్లందు: అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వలన గ్రామాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ పై దృష్టి సారించాలని ఎమ్మెల్యే కనకయ్య అన్నారు. ఇల్లందు మండలం ప్రజా పరిషత్ కార్యాలయం* నందు మండలం శాఖ అధికారులతో *ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య* సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్ష ప్రభావం వలన గ్రామాల్లో దెబ్బతిన్న అంతర్గత రోడ్లు,బీటి రోడ్లు గుర్తించి వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలన్నారు.చెరువులు,కుంటల పొంగి పోర్లుతున్నాయి చిన్న పిల్లలను అటువైపు వెళ్ళకుండా చుడాలన్నారు. విధ్యుత్ ఉత్పత్తి నిర్విరామంగా కొనసాగాలి,ప్రజలకు ఇబ్బంది కలుగవద్దన్నారు. వర్షా ప్రభావం వలన నియోజకవర్గ ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందువలన ప్రభుత్వ డాక్టర్స్,ఎఎన్ ఎం, ,నర్సులు అందరు కుడా ప్రజలను చైతన్య పరచాలని,ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో సరిపడా మందులు నిల్వ ఉంచుకొవాలని సూచించారు. ్రామాలలో లోతట్టు ప్రాంతాలలో,పురాతన కాలపు ఇళ్ళలో నివసించేవారిని గుర్తించాలని,దోమల బేడద పెరిగే అవకాశం ఉన్నందున,నిల్వ నీరు లేకుండా చుడాలని,బ్లీచింగ్,దోమల స్ప్రెయింగ్ జరిపించాలని కోరారు. విధ్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని,మర్రిగూడెం లాంటి విషాద వార్తలు పునరావృతం కాకుండా,గిరిజన ప్రాంతాలు కావడం వలన గ్రామాలలో లైన్మెన్లు సక్రమంగా పని చేయాలని తెలిపారు. మండలంలో ఉన్న ప్రభుత్వ హస్టల్ లలో పరిశుభ్రత పాటించాలని,పిల్లలకు సక్రమంగా మెనూ అందించాలని,ఆకస్మిక తనిఖిలు ఉంటాయని,తప్పు జరిగే ఉపేక్షించే అవకాశం ఉండదని తెలిపారు. రెవిన్యూ,ఇరిగేషన్,పంచాయితి రాజ్ శాఖ,అగ్రికల్చర్ అధికారులు చెరువులు కుంటలు మత్తడి దునుకుతున్నడంతో చుట్టు పరిసర ప్రాంతాలకు చిన్న పిల్లులు రాకుండా చుడాలని,అంతర్గత,బిటి రోడ్లు గుంతలు పడిన వాటిని గుర్తించి తక్షణమే మరమ్మత్తు పనులు చెపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో *ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు.. మండలం ఎంపిడిఓ ధన్ సింగ్, డిఎస్పి చంద్ర భాను,అగ్రికల్చర్ ఎవో సతీష్,కొమరారం పిహెచ్సి డాక్టర్ లోహిత,రొంపేడ్ డాక్టర్ కమిత,విటనరి డాక్టర్ హర్షిత,రెవిన్యూ ఆర్ ఐ కామేశ్వరరావు,ఆర్ డబ్ల్యు ఎఈ బాలాజి,విధ్యుత్ ఎఈ హర్షిణి,సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ,మండలం మాజీ వైస్ ఎంపిపి మండల రాము,మండల పార్టీ అధ్యక్షుడు పులి సైదులు,మూతి క్రిష్ణ,బానోత్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.



# విద్యాశాఖలో కార్యాలయం పంచాయతీ

* ఎం ఈ ఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల ఆందోళన
* కూకట్ పల్లి కార్యాలయం లో బాలానగర్ ఎం ఈ ఓ కార్యకలాపాలపై ఆగ్రహం
* కూకట్ పల్లి ఎం ఈ ఓ కు అప్పగించాలని డిమాండ్

**(ప్రజాస్ఫూర్తి, కూకట్ పల్లి) :**
కూకట్ పల్లి, బాలానగర్ మండల విద్యాధికారుల (ఎం ఈ ఓ) పంచాయతీ చిలికి చిలికి గాలివానగా మారింది. ఏకంగా మండల విద్యాధికారి కార్యాలయాన్ని తమ ఎం ఈ ఓ కు అప్పగించాలని కూకట్ పల్లి మండల ఉపాధ్యాయులు నిరసన చేపట్టారు. మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో కూకట్ పల్లి మండలానికి చెందిన ఉపా ధ్యాయులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూకట్ పల్లి పరిధిలోగల మండల విద్యాధి కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. కూకట్ పల్లి మండలం కు చెందిన మండల విద్యాధికారి కార్యాలయం లో గత కొంత కాలంగా బాలనగర్ ఎం ఈ ఓ తిష్ట వేశారు. దీంతో కూకట్ పల్లి ఎం ఈ ఓ కు కార్యాలయం లేకుండా పోయింది. కూకట్ పల్లి మండలానికి ఎం ఈ ఓ కార్యాలయం ఉండి కూడా లేనట్లే అయింది. కూకట్ పల్లి మండల పరిధిలోగల పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించే యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, ఉపాధ్యాయులకు అందించే బోధన సామాగ్రి, డిజిటల్ యంత్ర పరికరాలు పెట్టుకోవడానికి కార్యాలయం లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ బిల్స్ , రిటర్మెంట్ అయిన ఉపాధ్యాయుల సర్వీస్ బుక్స్ జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి కూకట్ పల్లి ఎం ఈ ఓ కార్యాలయానికి పోస్టల్ డిపార్ట్మెంట్ ద్వారా వచ్చి ఎవరు అందుబాటులో లేకపోవడం తో డోర్ లాక్ అంటూ తిరిగి వెళ్లడం జరుగుతుందని ఉపాధ్యాయులు భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా మండల విద్యాధికారి విద్యా వ్యవస్థకు సంబంధించిన ఏదైనా ఒక ప్రొసీడింగ్ తీయాలన్నా, మండల పరిధిలో విద్యా వ్యవస్థ పై ఏదైనా ఒక మీటింగ్ పెట్టాలన్న కనీసం కార్యాలయం లేకపోవడంతో ఉపాధ్యాయులు ,ఎం ఈ ఓ చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. కూకట్ పల్లి మండల పరిధిలో గల ఎం ఈ ఓ కార్యాలయమును కూకట్ పల్లి అధికారులకు అప్పగించాలని మండలం లో ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. అయినా ఎవరు స్పందించకపోవడం తో ఉపాధ్యాయులు తమ నిరసనను తెలియజేశారు. ఇకనైనా ఉన్నత అధికారులు బాలానగర్ లోని ఎం ఈ ఓ కార్యాలయానికి సదరు ఎం ఈ ఓ ను పంపించాలని డిమాండ్ చేశారు.

# రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పని చేస్తాం : తేజస్వీ యాదవ్



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పని చేస్తాం అని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ పేర్కొన్నారు. బిహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణను వ్యతిరేకిస్తూ.. రాహుల్ గాంధీ 'ఓటర్ అధికార యాత్ర' ప్రారంభించిన సంగతి తెలిసిందే. మంగళవారం నవాడాలో జరిగిన ఈ యాత్రలో తేజస్వీ పాల్గొని మాట్లాడారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతిపక్షాలన్నీ కృషి చేస్తాయన్నారు. తేజస్వీ వ్యాఖ్యల సమయంలో రాహుల్ కూడా పక్కనే ఉన్నారు. ఇక, దీనికి ముందు తేజస్వీ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ.. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విలేకరుల సమావేశంలో ఆయన వాస్తవాలతో కూడిన స్పష్టమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని విమర్శించారు. ప్రధానమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన స్క్రిప్ట్‌ను ఆయన చదివి వినిపించారని ఎద్దేవా చేశారు. ప్రాణాలతో ఉన్న వారిని చనిపోయినట్లు ఎందుకు పేర్కొంటున్నారో తమకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ఆయన భాజపాలో సభ్యత్వం తీసుకొని ఉంటే చెప్పాలంటూ విమర్శలు చేశారు. ఓటర్ అధికార యాత్రకు ప్రజల నుంచి పెద్దఎత్తున మద్దతు లభిస్తుందన్నారు. దీంతో ఎన్నికల సంఘాన్ని ప్రభావితం చేసి.. భాజపా ఓట్లను ఎలా దొంగిలిస్తుందో ప్రజలు అర్థం చేసుకుంటున్నారన్నారు. బిహార్‌లో ఓట్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఓట్ల చోరీపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పెద్దఎత్తున ఆందోళన వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ఓట్ల విషయంలో భాజపాతో కలిసి ఈసీ అవకతవకలకు పాల్పడుతుందని రాహుల్ ఆరోపిస్తున్నారు. ఈక్రమంలోనే ఆయన బిహార్‌లో 'ఓటర్ అధికార యాత్ర' చేస్తున్నారు. విపక్షాల ఆరోపణలపై ఇటీవల జ్ఞానేశ్ కుమార్ విలేకరులతో మాట్లాడారు. రాహుల్ ఆరోపణలపై తగిన ఆధారాలనైనా సమర్పించాలని, లేదంటే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వద్ద ఆధారాలు ఉంటే వారం రోజుల్లో ప్రమాణపత్రం రూపంలో సంతకం చేసి తమకు సమర్పించాలని ఈసీ అల్టిమేటం జారీ చేసింది.

# ముంబయిలో భారీ వర్షాలు.. 250కి పైగా విమాన సర్వీసులపై ఎఫెక్ట్



ముంబయిలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, రైల్వే లైన్లు, దిగువ ప్రాంతాలు నీటితో నిండిపోయాయి. దీంతో భారత వాతావరణ సంస్థ (ఐఎండీ) రెడ్ అలర్ట్ జారీ చేసింది. వాతావరణం అనుకూలంగా లేనందున ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీనివల్ల దాదాపు 250కి పైగా విమాన సర్వీసులపై ప్రభావం పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి 9.50 గంటల ప్రాంతంలో 8 విమానాలను దారి మళ్లించినట్లు తెలిపారు. విమాన సర్వీసులు సగటున 45 నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తున్నట్లు వెల్లడించారు. ఈమేరకు ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాల సమయాలను సంబంధిత వెబ్‌సైట్లలో చెక్ చేసుకోవాలని సూచించింది. పలు విమానయాన సంస్థలు ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. వరదల కారణంగా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో ముందుగానే ఇళ్ల నుంచి బయల్దేరాలని సూచించాయి. మరోవైపు భారీ వరదలకు రైలు పట్టాలు నీట మునిగిపోవడంతో ముంబయి లోకల్ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. భారీ వర్షాల కారణంగా పాఠశాలలు, కళాశాలలు, పలు ప్రభుత్వ కార్యాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ప్రైవేటు ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం చేసుకోవాలని సూచించింది. అవసరమైతే తప్ప ప్రజలకు బయటకురావద్దని ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) విజ్ఞప్తి చేసింది. గత 24 గంటల్లో, నగరంలోని అనేక ప్రాంతాల్లో 200 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. విక్రోలి ప్రాంతంలో అత్యధికంగా 255.5 మి.మీ వర్షపాతం నమోదైనట్లు పేర్కొంది. భారీ వర్షపాతం కారణంగా గంటకు 4050 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది.

# యూకేలో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి..!

యూకేలో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ ఘటనకు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడులకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. శిరోమణి అకాలీదళ్‌కు నాయకత్వం వహిస్తున్న సుఖ్‌బీర్ సింగ్ బాదల్ తెలిపిన వివరాల ప్రకారం.. యూకేలోని వోల్వర్‌హాంప్టన్ రైల్వే స్టేషన్ వద్ద ఈనెల 15న ఈ ఘటన జరిగింది. ఇద్దరు సిక్కు వ్యక్తులపై ముగ్గురు యువకులు దాడి చేశారు. ఈ జాత్యహంకార దాడిని తాను పూర్తిగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా యూకేలోని సిక్కు ప్రవాసుల భద్రత గురించి అధికార ప్రభుత్వం వద్ద లేవనెత్తాలని విదేశాంగ మంత్రి జైశంకర్‌ను ఆయన కోరారు. బాధితులకు న్యాయం చేయాలని అక్కడి పోలీసులను అభ్యర్థించారు. ఇలాంటి ప్రవర్తనను సహించేది లేదని పోలీసులు హెచ్చరించారు.

# కార్గో షిప్ నుంచి... జారి సముద్రంలో పడిపోయిన 48 కంటెయినర్లు



ఒమన్ నుంచి వెళ్తున్న ఓ కార్గో షిప్ నుంచి దాదాపు 48 కంటెయినర్లు సముద్రంలో జారిపడినట్లు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ అధికారులు పేర్కొన్నారు. వాటిలో ఇప్పటికి 8 కంటెయినర్లు మాత్రమే దొరికాయన్నారు. కంటెయినర్లు అరేబియా సముద్రం గుండా ఒడ్డుకు కొట్టుకువచ్చే సూచనలు ఉండటంతో మహారాష్ట్రలోని పాల్ఘర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఒమన్‌లోని సలాహ్ నుంచి బయల్దేరిన 'MV ఫోనిక్స్ 15' అనే కార్గో షిప్ 20 నాటికల్ మైళ్ల దూరం వచ్చిన తర్వాత అందులో నుంచి 48 కంటైనర్లు సముద్రంలో పడిపోయాయి. కంటెయినర్లను లేదా సంబంధిత వస్తువులను గుర్తిస్తే భారత నావికాదళానికి, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంతాల్లోని గ్రామస్థులు, గస్తీ బృందాలకు అధికారులు సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి కొంకణ్ తీర ప్రాంతంలో కేంద్ర సముద్ర సంస్థల సమన్వయంతో నిరంతరం నిఘా నిర్వహిస్తున్నట్లు పాల్ఘర్ పోలీసులు తెలిపారు. అయితే ఈ కంటెయినర్లలో ఏమున్నాయనే విషయం ఇంకా తెలియరాలేదు. మే నెలలో ఇలాగే లైబీరియాకు చెందిన ఓ భారీ నౌక కేరళ సముద్రతీరానికి 38 నాటికల్ మైళ్ల దూరంలో సముద్రంలో మునిగిపోయిన విషయం తెలిసిందే. ఆ నౌకలో 640 కంటైనర్లు ఉండగా.. వాటిలో 13 కంటైనర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటైనర్లలో కాల్షియం కార్బైడ్, మిగిలిన వాటిలో 84.44 మెట్రిక్ టన్నుల డీజిల్, 367.1 మెట్రిక్ టన్నుల ఫర్నేస్ ఆయిల్ ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# సింగరేణికి బంగారు అవకాశం వచ్చింది: సీఎండీ బలరామ్

హైదరాబాద్: సింగరేణి సంస్థ కీలక ఖనిజరంగంలోకి ప్రవేశించింది. బంగారం, రాగి గనుల అన్వేషణకు లైసెన్స్ దక్కించుకుంది. కర్ణాటకలోని దేవదుర్గ్‌లో బంగారం, రాగి గనుల అన్వేషణ లైసెన్స్ కోసం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో 37.75శాతం రాయల్టీని కోట్ చేయడం ద్వారా సింగరేణి ఎల్ 1 బిడ్డర్‌గా నిలిచిందని సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ తెలిపారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చేస్తున్న ప్రయత్నంలో తొలి విజయం సాధించినట్టు ఆయన పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో ఈ గనుల్లో అన్వేషణ పూర్తి చేస్తామని సీఎండీ బలరామ్ స్పష్టం చేశారు. కర్ణాటక దేవదుర్గ్ లోని బంగారం, రాగి నిక్షేపాలు ఉన్న ప్రాంతంలో సింగరేణి అన్వేషణ విభాగం ఆధ్వర్యంలో త్వరలో పరిశోధన చేయనుంది. వివిధ రకాల అన్వేషణల అనంతరం తుది ఫలితాలను కేంద్ర ప్రభుత్వానికి నివేదిక రూపంలో సమర్పించాల్సి ఉంటుంది. అనంతరం కేంద్రం




ఈ గనులను మైనింగ్ కోసం వేలం వేస్తుంది. ఆ గనులను సింగరేణి లేదా ఇతర సంస్థలు దక్కించుకోవడానికి అవకాశం ఉంటుంది. ఈ గనులను మైనింగ్ కోసం దక్కించుకున్న సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీలో 37.75 శాతాన్ని ఆ గని జీవిత కాలం పాటు సింగరేణికి చెల్లించాల్సి ఉంటుంది. ఈ అన్వేషణ కోసం దాదాపు రూ.90 కోట్లు వ్యయం అవుతుండగా..అందులో రూ.20 కోట్లు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీగా చెల్లిస్తుంది.

## చెక్ డ్యామ్ రెండు నెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం సమాధానం చెప్పాలి

**: కేటీఆర్**

హైదరాబాద్: మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం గుడిబండ పెద్దవాగుపై నిర్మించిన చెక్ డ్యామ్ రెండు నెలల్లో ఎందుకు కొట్టుకుపోయిందో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని భారత రాష్ట్రసమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎక్స్ వేదికగా స్పందించిన ఆయన .. ఎస్ఎల్‌బీసీ సొరంగం తవ్వడం చేతకాదు, సుంకిశాల రిటైనింగ్ వాల్ సరిగా కట్టే పరిస్థితి లేదని ఆక్షేపించారు. చివరికి చెక్ డ్యామ్‌ను కూడా నిర్మించలేని కాంగ్రెస్ నేతలు.. కాళేశ్వరం ప్రాజెక్టుపై బురద జల్లడం సిగ్గుచేటని మండిపడ్డారు. గుడిబండ పెద్దవాగుపై కాంగ్రెస్ కాంట్రాక్టర్ నిర్మించిన చెక్ డ్యామ్ రెండు నెలల్లోనే ఎందుకు కొట్టుకుపోయిందో సీఎం సమాధానం



చెప్పాలన్నారు. నాసిరకం పనులు చేసి రైతులు తీవ్రంగా నష్టపోయేందుకు కారణమైన ప్రతి ఒక్కరిపై సర్కారు చర్యలు తీసుకొని బాధితులను ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను వెంటనే తొలగించండి

హైదరాబాద్: విద్యుత్ స్తంభాలపై కేబుల్ వైర్లను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇటీవల రాష్ట్రంలో పలుచోట్ల టీవీ, ఇంటర్నెట్ కేబుళ్ల (వైర్లు) ఏర్పాటులో నిర్లక్ష్యంతో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. తాజాగా హైదరాబాద్ రామంతాపూర్‌లో ఐదుగురి మృతికి రోడ్డుకు అడ్డంగా లాగిన కేబుల్ తెగి విద్యుత్‌లైనుపై పడటమే కారణమని విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం) అధికారులు



ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. దీంతో మంగళవారం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో భట్టి సమీక్షా నిర్వహించారు. అనుమతులు లేకుండా ఎలాంటి విద్యుత్ కనెక్షన్లు ఉన్నా వెంటనే తొలగించాలన్నారు. కేబుల్ వైర్లు తొలగింపునకు ఏడాది సమయం ఇచ్చినా ఆపరేటర్లు స్పందించలేదన్నారు. వారి నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సచివాలయంలో జగ్గారెడ్డి సమావేశం... సీరియస్ అయిన సీఎస్

కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి నేడు సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ అధికారులతో సెక్రటేరియట్ లో జగ్గారెడ్డి ఏర్పాటు చేసిన సమీక్షపై సీఎస్ రామకృష్ణా రావు సీరియస్ అయినట్టు సమాచారం. ఎమ్మెల్యే కాకపోయినా ఏ పదవీ లేకపోయినా ఏ అధికారంతో ప్రభుత్వ అధికారులతో సెక్రటేరియట్ లో మీటింగ్ నిర్వహిస్తారని జోరుగా చర్చ నడుస్తోంది. మిషన్ భగీరథ నీటి సరఫరాపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంపట్ల, సీఎం నుంచి రూ.200 కోట్ల నిధులు తెస్తాననడం పట్ల ఏ అధికారం ఉందని అదేశాలు ఇస్తాడు అంటూ



సచివాలయ ఉద్యోగులు అవాక్కయ్యారు. కాగా ఈ సమావేశానికి ఎవరి అనుమతి తో వెళ్లారని కలెక్టర్ కూడా అరా తీసినట్లు సమాచారం. మరోవైపు జగ్గారెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని సీఎంను కోరుతున్నారు అధికారులు.

## మహిళ పేరుతో డేటింగ్.. రూ.1.80లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్: నగరంలోని మెహదీపట్నానికి చెందిన యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.80లక్షలు కాజేశారు. ఓ డేటింగ్ యాప్‌లో శివాని అనే పేరుతో సైబర్ నేరగాళ్లు పరిచయం చేసుకున్నారు. వాట్సప్ నంబర్ తీసుకుని బాధితుడు ఆమెతో చాటింగ్ చేశాడు. రాత్రి ఒంటి గంట సమయంలో వీడియో కాల్ చేయాలని శివాని కోరింది. వీడియో కాల్ చేసి తన ముఖం చూపించడంతో.. బాధితుడి ఫేస్‌ను ఎడిట్ చేసి న్యూడ్ వీడియోగా మార్చి వాట్సప్ చేశారు. అతని స్నేహితులు, బంధువులకు వీడియో పంపుతామని బెదిరించి రూ.1.80లక్షలు కాజేశారు. ఇదంతా సైబర్ మోసగాళ్లు పన్నిన కుట్ర అని ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు..



అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గణేష్ ఉత్సవాల కోసం ప్రత్యేక బస్సులు: మంత్రి పొన్నం

గ్రేటర్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచేలా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరిగేలా చూడాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. MCRHRDలో మంగళవారం గణేష్ ఉత్సవాలు 2025 సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై శాఖల వారీగా ఏర్పాట్లను సమీక్షించి రాష్ట్ర రాజధానిలో గణేష్ ఉత్సవాల కోసం వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఏర్పాట్లు పక్కాగా, వేగవంతంగా జరగాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రమంతటా వర్షాలు అధికంగా కురుస్తున్నందున ప్రతి ఒక్కరు గణేష్ విగ్రహాలు వాహనాల ద్వారా తీసుకువెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గణేష్‌మండపలాకు ఉచిత విద్యుత్ అందిస్తుందని, జీహెచ్‌ఎంసి ద్వారా రోడ్లు, వీధిలైట్లు, చెరువులు కుంటల్లో నీళ్లు నింపడం, పారిశుద్ధ్య పనులు, మొబైల్ టాయిలెట్లు తదితర పనులు చేపట్టడం



జరుగుతుందన్నారు. ఖైరతాబాద్, బాలాపూర్ గణేష్ విగ్రహాలు అతి పెద్దగా ఉండటంతో విగ్రహాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి ఇబ్బందులు అలాగే సంఘటనలు జరగకుండా ముందస్తు ప్రణాళికలతో కార్యక్రమాలు నిర్వహించుకోవాలని మంత్రి సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మండపాల ఏర్పాటు సమయంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. విద్యుత్ వలన జరిగే నష్టాలపై కరపత్రాలను, గోడ పత్రికలను ప్రతి మండపంలో అందించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలని, గణేష్ ఉత్సవాలు విజయవంతం కావడానికి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, సభ్యులు అలాగే ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల నిర్వహణలో భాగంగా సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడే విధంగా వివిధ రకాల కళా ప్రదర్శనలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ ద్వారా గణేష్ ఉత్సవాలకు అదనంగా 600 బస్సులు నడపనున్నట్లు పొన్నం ప్రభాకర్ తెలిపారు . మండపాల వద్ద పోలీసులు, విద్యుత్ అలాగే జిహెచ్‌ఎంసి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే నివృత్తి చేసే విధంగా ఉండాలని సూచించారు. నిమజ్జనం రోజు చెరువుల వద్ద కుంటల వద్ద క్రేన్లను ఏర్పాటుతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు .

## కాంగ్రెస్‌ను అభాసుపాల్జేయాలని ఆ రెండు పార్టీల కుట్ర: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్: రాష్ట్రానికి రావాల్సిన యూరియాను కేంద్రం తక్షణమే ఇవ్వాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీద అక్కసుతో రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇవ్వట్లేదని ఆరోపించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తుంటే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దిల్లీలో ఉన్నారని విమర్శించారు. “కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదు. భాజపా, భారత రాష్ట్ర సమితి లోపాయికారీ ఒప్పందంతో యూరియాను అడ్డుకుంటున్నాయి. కాంగ్రెస్‌ను అభాసుపాల్జేయాలని కుట్ర చేస్తున్నాయి.



ఇప్పటికే యూరియా కోసం సీఎం రేవంత్, మంత్రి తుమ్మల కేంద్రానికి లేఖ రాశారు. రైతులు ఆందోళన చెందవద్దు” అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## మహిళా భద్రతపై కేంద్రం స్పెషల్ ఫోకస్ : బండి సంజయ్

ఢిల్లీ, ముంబై, చెన్నై, హైదరాబాద్, బెంగళూరుసహా 8 నగరాల్లో ‘సేఫ్ సిటీ’ ప్రాజెక్టు కింద మహిళల భద్రత కోసం పలు సౌకర్యాలను కల్పిస్తున్నట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఈ ప్రాజెక్టు కింద ఆయా రాష్ట్రాల్లో 33 వేల సీసీటీవీల ఏర్పాటుతోపాటు పింక్ టాయిలెట్లు, మహిళా పెట్రోల్ యూనిట్లు, కౌన్సిలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం నిర్భయ నిధి కింద రూ.2,840 కోట్లను ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఏడాది మార్చ్ నాటికి ఆయా సౌకర్యాలన్నింటినీ కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈరోజు న్యూఢిల్లీలోని నార్త్ బ్లాక్ లో మహిళా భద్రతా విభాగం అధికారులతో బండి సంజయ్ సమావేశమయ్యారు. క్రిమినల్ న్యాయవ్యవస్థలోని అన్ని ప్రధాన విభాగాలను (పోలీస్, జైలు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, కోర్టులు) ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకువచ్చి సమగ్ర సమాచార మార్పిడి జరగడానికి రూపొందించిన సమగ్ర వ్యవస్థ ఇంటర్‌ఆపరబుల్ క్రిమినల్ జస్టిస్ సిస్టమ్ 2.0 తోపాటు, ఫోరెన్సిక్ సామర్థ్యాల ఆధునికీకరణ, నేషనల్ ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎన్‌హాన్స్‌మెంట్ స్కీమ్, జైళ్ల ఆధునికీకరణ, సేఫ్ సిటీ ప్రాజెక్టులు, “మహిళల భద్రత” కింద అంబ్రెల్లా స్కీమ్, మహిళా సహాయక డెస్కులు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సపోర్ట్ సిస్టమ్ వ్యవస్థల పనీతీరు, కార్యక్రమాల



అమలులో ఎదురవుతున్న ఇబ్బందులు, సాధించిన విజయాలను అడిగి తెలుసుకున్నారు. దేశవ్యాప్తంగా మహిళల భద్రత, సురక్షిత వాతావరణం కోసం అమలు చేస్తున్న పథకాలను, రూపొందించిన ప్రణాళికలను వివరిస్తూ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. మహిళల కోసం అత్యవసర ప్రతిస్పందన వ్యవస్థ (ERSS)లను ఏర్పాటు చేయడంతోపాటు ఏఐ, వాట్సాప్, చాటా బాట్ మొదలైన మల్టీ చానల్ సపోర్టు తీసుకుంటున్నట్లు తెలిపారు. మహిళల కోసం ప్రత్యేకంగా జాతీయ అత్యవసర నంబర్ - “112” ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.. జైలు సంస్కరణల్లో భాగంగా హై సెక్యూరిటీ జైళ్ల నిర్మాణంతోపాటు పేద ఖైదీలకు సహాయ పథకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. హై సెక్యూరిటీ జైళ్ల నిర్మాణం కోసం కేంద్రం రూ.950 కోట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. సీసీటీవీలు, జామర్లు, స్కానర్లు వంటి అధునాతన సాంకేతికత సౌకర్యాలను ఆయా జైళ్లకు కల్పించడంతోపాటు పేద ఖైదీల సంక్షేమ పథకం కింద ఏటా రూ.20 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు.. దేశంలోని అన్ని జిల్లాల్లోనూ మానవ అక్రమ రవాణా నిరోధించేందుకు యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసం బంగ్లాదేశ్, యూఏఈ, కంబోడియా, మయన్మార్‌సహా పలు దేశాలతో అంతర్జాతీయంగా ఒప్పందాలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ మహిళల రక్షణ, సాయం కోసం పలు కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. యాసిడ్ అటాక్ బాధితులకు రూ.1 లక్ష ప్రత్యేక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం కేంద్రం రూ.200 కోట్లను కేటాయించినట్లు పేర్కొన్నారు.

## గాంధీ ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారిని నియమిస్తాం

**: మంత్రి దామోదర రాజనర్సింహ**

సికింద్రాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు పెరిగాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గాంధీ సమస్యల అధ్యాయానికి వాటి పరిష్కారానికి ఆసుపత్రిలో స్పెషల్ ఆఫీసర్ ను నియమించబోతున్నట్లు తెలిపారు. మంగళవారం ఆయన గాంధీ ఆస్పత్రిని సందర్శించారు. హాస్పిటల్ లోని అన్ని విభాగాలలో తిరిగి తనిఖీలు చేశారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అన్ని విభాగాల వైద్య అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం ఆయన



మీడియాతో మాట్లాడారు. ఫైర్ ఫైటింగ్ పరికరాలు, విద్యుత్ సమస్యలు, మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ పై సమావేశంలో చర్చించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయాలు పెరిగాయని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 మంది బయో మెడికల్ ఇంజనీర్లను నియమించాలని చూస్తున్నట్లు చెప్పారు. గాంధీ హాస్పిటల్ సిబ్బంది కొరతను అధిగమించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

## దూకుడు కొనసాగించిన స్టాక్ మార్కెట్ సూచీలు

వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు

జీఎస్టీ హేతుబద్ధీకరణ అంచనాలతో పెరిగిన కొనుగోళ్ల జోరు

370 పాయింట్లు లాభపడి 81,644 వద్ద ముగిసిన సెన్సెక్స్

103 పాయింట్లు పెరిగి 24,980కి చేరిన నిఫ్టీ

ఆటో, ఎఫ్‌ఎంసీజీ రంగాల షేర్లలో కనిపించిన భారీ కొనుగోళ్లు

సానుకూలంగా స్పందించిన మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోరును కొనసాగించాయి. వరుసగా రెండో రోజైన మంగళవారం కూడా కీలక సూచీలు భారీ లాభాలతో ముగిశాయి. జీఎస్టీ హేతుబద్ధీకరణ ఉంటుందన్న సానుకూల అంచనాలు మార్కెట్‌కు కొత్త ఉత్సాహాన్నిచ్చాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు కూడా తోడవడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు.

ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 370 పాయింట్ల లాభంతో 81,644.39 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 103.70 పాయింట్లు పెరిగి 24,980.65 వద్ద ముగిసింది. మంగళవారం ఉదయం సెన్సెక్స్ 81,39.11 వద్ద గ్యాప్-అప్‌తో ప్రారంభమై, రోజంతా సానుకూలంగానే కదలాడింది. ఒక దశలో 81,755.88 వద్ద ఇంట్రా-డే గరిష్ఠాన్ని కూడా తాకింది.

జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై పెరుగుతున్న అంచనాలు, ఇటీవల భారత్ క్రెడిట్ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేయడం వంటి అంశాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం కూడా మార్కెట్‌కు కలిసొచ్చిందని ఆయన విశ్లేషించారు.

రంగాలవారీగా చూస్తే నిఫ్టీ ఆటో, ఎఫ్ఎంసీజీ సూచీలు ఒక శాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో కూడా కొనుగోళ్ల మద్దతు కనిపించింది. సెన్సెక్స్-30 షేర్లలో టాటా మోటార్స్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ బ్యాంక్, మారుతీ, ఐటీసీ అత్యధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి. మరోవైపు, బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్ గ్రిడ్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా లాభపడ్డాయి.

## భారతీయుల కోసం ఓపెన్‌ఏఐ చవకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్..

రూ. 399కే 'చాట్‌జీపీటీ గో'




**న్యూఢిల్లీ:** భారతీయ వినియోగదారులకు ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఓపెన్‌ఏఐ గుడ్ న్యూస్ చెప్పింది. 'చాట్‌జీపీటీ గో' పేరుతో సరికొత్త, చవకైన సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను మంగళవారం ప్రకటించింది. కేవలం రూ.399కే ఈ ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ప్లాన్ ద్వారా భారతీయ వినియోగదారులు అధిక వినియోగ పరిమితులు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్స్, ఎక్స్‌టెండెడ్ మెమరీ వంటి ప్రీమియం ఫీచర్లను తక్కువ ధరకే పొందవచ్చు.

ఉచిత ప్లాన్‌తో పోలిస్తే 'చాట్ జీపీటీ గో'లో మెసేజ్ లిమిట్, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్‌లోడ్‌లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. అంతేకాదు, మెమొరీ కూడా ఉచిత ప్లాన్‌తో పోలిస్తే రెండింతలు ఎక్కువగా ఉండనుంది. భారత్‌లో ఓపెన్ ఏఐ టూల్స్‌కు డిమాండ్ దృష్ట్యా.. చాట్‌జీపీటీ గో పేరుతో కొత్త సేవల్ని తీసుకొచ్చినట్లు సంస్థ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇండిక్ లాంగ్వేజీ సపోర్టుతో పాటూ.. ఈ సబ్‌స్క్రిప్షన్‌కి యూపీఐ ద్వారా చెల్లింపులు చేయొచ్చని సంస్థ తెలిపింది.

కాగా, భారత్‌లో ఇప్పటికే పలు ప్లాన్‌లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. పవర్ యూజర్ల కోసం ఉద్దేశించిన 'చాట్‌జీపీటీ ప్లస్' ప్లాన్ ధర నెలకు రూ. 1,999గా ఉంది. ఇక నిపుణులు, ఎంటర్‌ప్రైజ్‌ల కోసం 'చాట్‌జీపీటీ ప్రో' ప్లాన్‌ను నెలకు రూ. 19,900 రుసుముతో అందిస్తోంది. వాటికి అదనంగా ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ అందుబాటులో ఉండనుంది.

## యాపిల్ కళ్లు చెదిరే డీల్..

బెంగళూరు కార్యాలయానికి రూ.1,000 కోట్లు అద్దె..!



**బెంగళూరు:** భారత్‌లో ఐఫోన్ల తయారీని భారీగా పెంచడంపై దృష్టి సారించిన దిగ్గజ టెక్ కంపెనీ యాపిల్ సంస్థ.. తయారీ, విక్రయ కార్యకలాపాల్ని వేగంగా విస్తరిస్తోంది. దేశీయంగా ఐఫోన్ ఉత్పత్తిని పెంచనున్నట్లు ఇప్పటికే యాపిల్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే తాజాగా బెంగళూరు లో ఎంబసీ జెనిత్ భవనంలో 2.7 లక్షల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని అద్దెకు తీసుకుంది.

డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్‌స్టాక్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ప్రముఖ రియల్ ఎస్టేట్ డెవలపర్ ఎంబసీ గ్రూప్‌కు చెందిన కమర్షియల్ ప్రాజెక్టు ఎంబసీ జెనిత్ లోని ఆ కార్యాలయ స్థలం కోసం 10 ఏళ్ల కాలానికి యాపిల్ సంస్థ డీల్ కుదుర్చుకుంది. 9 అంతస్తుల్లో (5 నుంచి 13వ అంతస్తు వరకు) విస్తరించి ఉన్న ఈ ఆఫీస్ స్పేస్ కోసం యాపిల్ సంస్థ నెలకు రూ.6.3 కోట్ల అద్దె చెల్లించనుంది. ఏడాదికి 4.5 శాతం చొప్పున అద్దె పెంపుతో పార్కింగ్, మెయింటెనెన్స్ చార్జీలతో కలిపిమొత్తం ఈ పదేళ్లలో సంస్థ రూ.1,000 కోట్లను అద్దెగా చెల్లించేందుకు ఒప్పందం చేసుకుంది. 2025 ఏప్రిల్ 3 నుంచి ఈ లీజు అమల్లోకి వచ్చింది. ఈ లీజు ఒప్పందంలో భాగంగా యాపిల్ రూ.31.57 కోట్లు డిపాజిట్ కూడా చేసింది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి అతి పెద్ద మొబైల్ ఫోన్ల ఎగుమతిదారుగా యాపిల్ నిలిచిన విషయం తెలిసిందే. సుమారు రూ.1.5 లక్షల కోట్ల విలువైన ఫోన్లను ఎగుమతి చేసింది.



# కెప్టెన్‌గా సూర్య, వైస్ కెప్టెన్‌గా గిల్..



ఆసియా కప్ జట్టును ప్రకటించిన బీసీసీఐ

**ముంబై:** ఆసియాకప్‌లో ఆడే భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. సెప్టెంబర్ 9వ తేదీ నుంచి ప్రారంభంకానున్న ఆ టోర్నీకి శుభమన్ గిల్ వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నాడు. మంగళవారం ముంబైలో సమావేశం అయిన బీసీసీఐ సెలెక్టర్ల బృందం భారత జట్టును ప్రకటించింది. మొత్తం 15 మంది ప్లేయర్ల బృందాన్ని వెల్లడించారు. అయ్యర్, జైస్వాల్‌కు చోటు దక్కలేదు.

స్టాండ్ బై ప్లేయర్ల జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేదు. ఈ టోర్నీ కోసం అయిదుగురు రిజర్వ్ ప్లేయర్లను ప్రకటించారు. ప్రసిద్ధ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, జైస్వాల్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్.. రిజర్వ్ లిస్టులో ఉన్నారు. అయితే ఆ జాబితాలో కూడా శ్రేయాస్ అయ్యర్ పేరు లేకపోవడం గమనార్హం.

సెప్టెంబర్ పదో తేదీన యూఏఈతో ఇండియా ఫస్ట్ మ్యాచ్ ఆడనున్నది. దుబాయ్ వేదికగానే సెప్టెంబర్ 14వ తేదీన పాకిస్థాన్‌తో హైవోల్టేజ్ మ్యాచ్ జరగనున్నది. ఇక 19వ తేదీన ఒమన్‌తో చివరి రౌండ్ మ్యాచ్ ఆడనున్నది.

**భారత జట్టు..**

సూర్యకుమార్ యాదవ్, గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శివం దూబే, అక్షర్ పటేల్, జితేశ్ శర్మ, బుమ్రా, హర్షదీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, సంజూ శాంసన్, హర్షిత్ రాణా, రింకూ సింగ్.



## ఛాంపియన్‌కు షాకిచ్చిన మహరాజ్..

రికార్డు విజయంతో సఫారీల బోణీ..!

**కైర్న్స్:** పొట్టి సిరీస్ కోల్పోయిన దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌లో అదిరే బోణీ కొట్టింది. సమిష్టిగా రాణించి డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియాపై రికార్డు విజయం సాధించింది. కైర్న్స్ మైదానంలో ఆల్‌రౌండ్ షోతో ఆసీస్‌కు వణుకుపుట్టించింది బవుమా సేన. మొదట ఏడెన్ మర్క్‌రమ్ (82), కెప్టెన్ తెంబ బవుమా(65)లు అర్ధ శతకాలతో భారీస్కోర్ చేసిన ప్రొటీస్ టీమ్.. అనంతరం ఆసీస్ బ్యాటర్లకు కళ్లెం వేసింది. పేసర్లు ఆదిలోనే బ్రేకివ్వగా.. కేశవ్ మహరాజ్(5-33) ప్రధాన ఆటగాళ్లను వరుసగా పెవిలియన్ చేర్చాడు. దాంతో.. సఫారీ టీమ్ ఏకంగా 98 పరుగుల తేడాతో ఓడించింది.

ఆస్ట్రేలియాను వాళ్ల సొంతగడ్డపై ఓడించడం ఏ జట్టుకైనా సవాలే. సమిష్టిగా రాణిస్తే తప్ప గెలుపు గడప తొక్కలేం. ఇప్పుడు వైట్ బాల్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా అదే వ్యూహాన్ని అనుసరిస్తోంది. పొట్టి సిరీస్‌లో అద్భుతంగా ఆడిన విజేతగా నిలవని సఫారీ జట్టు వన్డే ట్రోఫీలో బోణీ కొట్టింది. మైదానంలో ఎడెన్ మర్క్‌రమ్(82), తెంబా బవుమా(65), బ్రీట్జ్(57)లు అర్ధ శతకాలతో చెలరేగి భారీ స్కోర్‌కు బాటలు వేశారు. అనంతరం ఛేదనలో ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ తడబడుతూ సాగింది. తొలి వికెట్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్(27), మిచెల్ మార్ష్ (88)లు అరవై రన్స్ జోడించి శుభారంభం ఇచ్చారు. వీళ్లిద్దరి మెరుపులతో ఆసీస్ ఈజీగా గెలుస్తుందనిపించింది.



కానీ, సుబ్రయణ్ తొలి దెబ్బ కొట్టగా.. ఆ తర్వాత కేశవ్ మహరాజ్(5-33) వికెట్ల వేటతో కంగారూలను వణికించాడు. మార్నస్ లబూషేన్(1), కామెరూన్ గ్రీన్(3), డేంజరస్ జోష్ ఇంగ్లిస్(5) .. అలెక్స్ క్యారీ(0)లను డగౌట్ చేర్చి మ్యాచ్‌ను సఫారీల వైపు తిప్పాడు. ఆఖర్లో బెన్ ద్వారుషి (33), నాథన్ ఎల్లిస్(14)లు కాసేపు పోరాడినా ఎంగిడి లోయర్ ఆర్డర్ కథ ముగించాడు. ఆడం జంపాను బౌల్డ్ చేయగా బవుమా బ్యాచ్ 98 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఐదు వికెట్లు తీసి ఆసీస్ నడ్డివిరిచిన మహరాజ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఇరు జట్ల మధ్య ఆగస్టు 22 శుక్రవారం రెండో వన్డే జరుగనుంది.

## ఆసియా కప్‌లో శ్రేయాస్ అయ్యర్‌కు దక్కని చోటు..

**న్యూఢిల్లీ:** సెప్టెంబర్‌లో యూఏఈ వేదికగా జరుగనున్న ఆసియా కప్ కోసం 15 మంది సభ్యుల భారత జట్టును బీసీసీఐ గురువారం ప్రకటించింది. సూర్యకుమార్ యాదవ్ నాయకత్వంలో భారత జట్టు ఈ టోర్నమెంట్‌లో ఆడనున్నది. శుభ్‌మన్ గిల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆసియా కప్ వచ్చే నెల 9 నుంచి మొదలుకానుండగా.. టీమిండియా తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10న ఆడుతుంది. అయితే, సీనియర్ బ్యాట్స్‌మెన్ శ్రేయాస్ అయ్యర్‌కు బీసీసీఐ మళ్లీ చోటు కల్పించకుండా మొండి చేయి చూపింది. టీ20 జట్టులో తప్పనిసరిగా అయ్యర్‌కు చోటు దక్కుతుందని అంతా భావించారు. బీసీసీఐ నిర్ణయం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఐపీఎల్‌లో శ్రేయాస్ బ్యాట్‌తో ఆకట్టుకున్నాడు. కెప్టెన్సీలో పంజాబ్ కింగ్స్‌ను ఫైనల్ వరకు నడిపించాడు.

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో జట్టును ప్రకటించారు. అయితే, అయ్యర్‌కు ఎందుకు చోటు కల్పించలేదన్న ప్రశ్నించగా.. అగార్కర్ మాట్లాడుతూ యశస్వీ జైస్వాల్ విషయంలో ఇది దురదృష్టకమని వ్యాఖ్యానించాడు. అయ్యర్ విషయంలో ఇదే పరిస్థితి అని చెప్పారు. అయ్యర్‌కు చోటు కోసం జట్టులో నుంచి ఎవరిని తప్పించాలని ప్రశ్నించాడు. ఈ విషయంలో



శ్రేయస్ అయ్యర్ తప్పిదం లేదని, తమ తప్పు కూడా లేదని చెప్పుకొచ్చాడు. అయ్యర్, జైస్వాల్ జట్టులో తప్పనిసరి పరిస్థితుల్లో చోటు కోల్పోవాల్సి వచ్చిందన్నాడు. యశస్వి జైస్వాల్ అవకాశం కోసం వేచి చూడడం దురదృష్టకరమని.. అభిషేక్ శర్మ ఓపెనర్‌గా అద్భుత ప్రదర్శన కనబరడంతో పాటు జట్టుకు ఎక్స్‌ట్రా బౌలింగ్ ఆప్షన్ లభిస్తుందన్నాడు.

తమకు 15 మంది ఆటగాళ్లను మాత్రమే ఎంపిక చేసుకునే అవకాశం ఉందని చెప్పుకొచ్చాడు. ఇంకా జట్టులోకి ఎక్కువ మందిని తీసుకునే అవకాశం ఉంటే.. జట్టులో చేర్చుకునే వాళ్లమని స్పష్టం చేశారు. భారత జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా గురించి సూర్యకుమార్ మాట్లాడుతూ.. టీ20 ప్రపంచ కప్ తర్వాత.. బుమ్రా టెస్ట్ క్యాలెండర్‌లో బిజీగా ఉన్నాడని.. ఇప్పుడు అతనికి సమయం ఉందని.. దాంతో జట్టులోకి తిరిగి వస్తున్నాడని పేర్కొన్నారు.

## తెలుగమ్మాయికి వరల్డ్ కప్ ఛాన్స్..

మంధానకు జోడీగా ప్రతీకా..!

**న్యూఢిల్లీ:** ఏడాది తర్వాత టీ20ల్లో పునరాగమనం చేసి అదరగొట్టిన షఫాలీ వర్మ కు మహిళల వన్డే ప్రపంచ కప్ స్క్వాడ్‌లో చోటు దక్కలేదు. ఇంగ్లండ్ పర్యటనలో అద్భుతంగా రాణించిన తెలుగమ్మాయి శ్రీచరణి తొలిసారి ప్రపంచ కప్ బెర్తు దక్కించుకుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ పోటీలకు మరో నలభై రోజులు ఉంది. టోర్నీ సన్నద్ధతను దృష్టిలో ఉంచుకొని మంగళవారం సెలెక్టర్లు 15 మందితో కూడిన స్క్వాడ్‌ను ప్రకటించారు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యారు.

సొంతగడ్డపై జరుగుబోయే వరల్డ్ కప్‌లో టైటిల్ సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది భారత జట్టు. అందుకు తగ్గట్టుగా జట్టు కూర్పు ఉండాలని పటిష్టమైన స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. కాబట్టి.. కొన్నిరోజులుగా వన్డేల్లో నిలకడగా రాణిస్తున్న వాళ్లనే స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. ఇంగ్లండ్ గడ్డపై ఒక్క మ్యాచ్‌లో మెరిసి.. తాజాగా ఇండియా ఏ తరఫున విఫలైమన షఫాలీకి సెలెక్టర్లు షాకిచ్చారు.

ఓపెనర్‌గా ఆమెను టీ20లకే పరిమితం చేస్తూ యువకెరటం ప్రతీకా రావల్‌కు తీసుకున్నారు. ఈమధ్యే మంధానకు జోడీగా దంచేసిన ప్రతీకా.. వరల్డ్ కప్‌లోనూ ఇన్నింగ్స్ ఆరంభించనుంది. వికెట్ కీపర్లుగా రీచా ఘోష్, యస్తికా భాటియాలు చోటు దక్కించుకోగా ఆల్‌రౌండర్లుగా దీప్తి శర్మ, రాధా యాదవ్, స్నేహ్ రానా, అమన్‌జోత్ కౌర్‌లు ఎంపికయ్యారు. బౌలింగ్ యూనిట్‌లో రేణుకా సింగ్, శ్రీచరణి, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డిలు ఉన్నారు. సెప్టెంబర్ 30 నుంచి మహిళల వన్డే వరల్డ్ కప్ షురూ కానుంది.



**వరల్డ్ కప్ స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), ప్రతీకా రావల్, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్(వికెట్ కీపర్), యస్తికా భాటియా(వికెట్ కీపర్), దీప్తి శర్మ, స్నేహ్ రానా, అమన్‌జోత్ కౌర్, రాధా యాదవ్, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్ ఠాకూర్.

**స్టాండ్ బై:** తేజల్ హస్నబిస్, ప్రేమా రావల్, ప్రియా మిశ్రా, ఉమా ఛెత్రీ, మిన్ను మణి, సయాలీ సథ్ఘారే.

# 30కి పైగా సినిమాలతో రాని క్రేజ్..
# 'కూలీ'తో వచ్చింది

కన్నడలో స్టార్ హీరోయిన్‌గా రచిత రామ్

కెరియర్‌లో 30కి పైగా సినిమాలు

రజనీ కోసం 'కూలీ' సినిమాలో చిన్న రోల్

ఆమె నటనకు అనూహ్యమైన రెస్పాన్స్

అందరి నోటా ఆమె మాటనే..



టాకీస్: సరైన సినిమా.. సరైన పాత్ర పడితే, అందరూ ఆ ఆర్టిస్ట్ గురించి మాట్లాడుకోవడానికి ఎంతో సమయం పట్టదని చెప్పచ్చు. సినిమా ఆర్టిస్టులంతా అలాంటి ఒక సమయం కోసం ఎంతకాలమైనా వెయిట్ చేస్తూ ఉంటారు. అలాంటి ఒక సమయం ఇప్పుడు 'కూలీ' సినిమాతో 'రచిత రామ్' తలుపు తట్టిందనే చెప్పాలి. ఎందుకంటే ఈ సినిమా చూసిన వాళ్లంతా ఆమె గురించే మాట్లాడుకుంటున్నారు. అలా అని చెప్పి ఆమె ఈ సినిమాలో చేసింది కీలకమైన రోల్ కాదు.. చాలా చిన్న రోల్. రచిత రామ్ 2013లోనే 'బుల్బుల్' అనే సినిమాతో హీరోయిన్ గా కన్నడ ఇండస్ట్రీలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి ఆమె అక్కడి స్టార్ హీరోలతో వరుస సినిమాలు చేస్తూ వెళుతోంది. చిరంజీవి మాజీ అల్లుడు కల్యాణ్ దేవ్ జోడీగా 'సూపర్ మచ్చి'తో తెలుగు తెరకి కూడా పరిచయమైంది. అయితే ఆ సినిమా ఫ్లాప్ కావడం వలన ఆమెను గురించి ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అలా తన కెరియర్ లో ఇంతవరకూ ఆమె 30 సినిమాలకు పైగా చేసింది. కానీ 'కూలీ' సినిమా ఆమెను గురించి అందరూ మాట్లాడుకునేలా చేసింది. ఈ సినిమాలో ఆమె సౌబిన్ షాహిర్ సరసన కనిపిస్తుంది. సైమన్ కొడుకుని వలలో వేసుకునే పాత్రలో నటించింది. నెగెటివ్ షేడ్స్ కలిగిన ఈ పాత్రలో ఆమె నటన అదుర్స్ అనిపించే స్థాయిలో ఉంటుంది. తెరపై కనిపించేది కొంతసేపే అయినా, ఆమె ప్రేక్షకులను ప్రభావితం చేయగలిగింది. ఈ సినిమా చూసిన తరువాత ఆమెను గురించి సెర్చ్ చేసినవారు ఎక్కువ. రజనీ, నాగ్, ఉపేంద్ర, ఆమీర్ ఖాన్, సౌబిన్ షాహిర్ వంటి స్టార్స్ ఉన్న ఈ సినిమాలో, ఆడియన్స్ ను తనవైపు తిప్పుకోవడం అంటే అంత తేలికైన విషయమేం కాదు. అలాంటి ఒక రేర్ ఫీట్ ను రచిత రామ్ సాధించిందని చెప్పచ్చు.

## కమల్, రజనీలతో లోకేశ్ మల్టీస్టారర్ మూవీ





**టాకీస్:** కూలీ సినిమాతో సూపర్ హిట్‌ని అందుకున్న దర్శకుడు లోకేష్ కనగరాజ్ మరో క్రేజీ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే నటుడు కార్తీతో ఖైదీ 2 సినిమాను లైన్‌లో పెట్టిన లోకేష్.. ఈ సినిమా కంటే ముందే మరో బిగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించబోతున్నాడని సమాచారం. సూపర్ స్టార్ రజనీకాంత్, లోకనాయకుడు కమల్ హాసన్‌లతో కలిసి కలిసి లోకేష్ ఒక భారీ మల్టీస్టారర్ చేయబోతున్నట్లు కోలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఇద్దరు వయసు మళ్లిన గ్యాంగ్‌స్టర్ల కథ అని తెలుస్తుంది. ఇద్దరు లెజెండరీ నటుల ఇమేజ్‌కు తగ్గట్టుగా లోకేష్ కనగరాజ్ ఈ కథను సిద్ధం చేశాడని.. ఈ కథకు ఇద్దరు హీరోలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఈ చిత్రాన్ని కమల్ హాసన్ సొంత నిర్మాణ సంస్థ అయిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ నిర్మించనుందని సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే ప్రకటన రాబోతుంది.

## థగ్ లైఫ్ ఫలితం..నాన్నను దెబ్బతీయదు

నటి శృతి హాసన్ కామెంట్స్



**టాకీస్:** అగ్ర హీరోల సినిమాల్లో నటిస్తూ శ్రుతిహాసన్ హిట్‌లను సొంతం చేసుకుంటున్నారు. తాజాగా 'కూలీ' సినిమాతో ప్రేక్షకులను పలకరించి ఆకట్టుకున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయాన్ని అందుకుంది. ఈసందర్భంగా హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శ్రుతి తన తండ్రి కమల్‌హాసన్ గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆయన ప్రభావం తనపై ఎంతో ఉందన్నారు. నేను కమల్ హాసన్ కుమార్తెగా పరిచయమయ్యాను. కాబట్టి నాపై ఆయన ప్రభావం చాలా ఉంటుంది. నా నటనను ఆయన యాక్టింగ్‌తో పోలుస్తుంటారు. కానీ దానివల్ల నేనెప్పుడూ ఇబ్బంది పడలేదు. ఆయన ఎప్పుడూ నావెంట ఉండడం నా అదృష్టంగా భావిస్తాను. ఇండస్ట్రీలోని ఎంతోమందిలో ఆయన స్ఫూర్తి నింపారు. నాన్న నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకోవచ్చు. ఎంత ఎదిగినా ఒదిగిఉండాలని ఆయన దగ్గర నుంచే నేర్చుకున్నాను' అని తెలిపారు. ఇక కమల్ హాసన్ నటించిన 'థగ్‌లైఫ్' మిశ్రమ ఫలితాలను సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. దీనిపై శ్రుతిహాసన్ మాట్లాడుతూ.. బాక్సాఫీస్ నంబర్లు కమల్‌హాసన్‌ను ప్రభావితం చేయలేవని తెలిపారు. 'పదేళ్ల క్రితం ఇండస్ట్రీలో ఈ నంబర్ల ప్రస్తావన ఉండేది కాదు. మా నాన్న తన సొంత డబ్బు పెట్టి సినిమా తీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆయనది నంబర్ల గురించి ఆలోచించే మనస్తత్వం కాదు. వాటి గురించి పట్టించుకోకుండా తన పని తాను చేసుకుంటారు' అని శ్రుతి హాసన్ వివరించారు.




## ఏఐ ఆధారిత హనుమాన్ మూవీ

భారీ ఎత్తున నిర్మించేందుకు సన్నాహాలు

టాకీస్: ఇప్పుడంతా పురాణాల కాలం నడుస్తోంది. పురాణాల ఆధారంగా చిత్రాలకు ఆదరణ పెరుగుతోంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం బాగా పెరుగుతోంది. -టెక్నాలజీ రంగం నుంచి హెల్త్, ఎడ్యుకేషన్, బిజినెస్, ఎంటర్‌టెయిన్‌మెంట్ తో పాటు-..



ముఖ్యంగా సినిమా పరిశ్రమలో ఏఐకి డిమాండ్ రోజు రోజుకు పెరుగుతోంది. కథలు రాయడం నుంచి విజువల్ ఎఫెక్ట్స్, యానిమేషన్ సన్నివేశాల వరకు ఏఐ ద్వారా సులభతరం అవుతుంది. ఇప్పటికే కొన్ని షార్ట్ ఫిల్మ్స్, యానిమేటెడ్ క్లిప్స్ మాత్రమే ప్రేక్షకుల ముందుకు రాగా, ఇప్పుడు బాలీవుడ్ నుంచి ఒక భారీ పూర్తి స్థాయి ఏఐ సినిమా రాబోతోందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రం 'చిరంజీవి హనుమాన్'. పురాణాల్లో అత్యంత శక్తివంతమైన దేవుడిగా, భక్తుడిగా పేరుగాంచిన హనుమంతుని శౌర్యం, భక్తి, అద్భుత గాథను ఏఐ ఆధారిత యానిమేషన్ శైలిలో చూపించబోతున్నారు.

## థామా హారర్ మూవీలో రష్మిక

టాకీస్: 'స్త్రీ' 'భేదియా', 'ముంజ్యా' లాంటి హారర్ కామెడీ చిత్రాలను తెరకెక్కించిన బాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ మాడ్ డాక్ ఫిలిమ్స్ మరో క్రేజీ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ హారర్ యూనివర్స్‌లో రాబోతున్న తాజా చిత్రం 'థామా'. ఈ సినిమాకు ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తుండగా.. నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా ప్రధనా పాత్రల్లో నటిస్తున్నారు. నవాజుద్దీన్ సిద్ధిఖీ విలన్ పాత్రలో నటించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమా దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే.. అతీంద్రియ శక్తులతో కూడిన ఓ రొమాంటిక్ చిత్రంగా రాబోతున్నట్లు- తెలుస్తుంది. ఇక ఈ చిత్రంలో రష్మిక తడకా పాత్రలో కనిపించ బోతుండగా.. ఆయుష్మాన్ ఖురానా అలోక్‌గా, నవాజుద్దీన్ సిద్ధిఖీ యక్షసాన్‌గా, పరేశ్ రావల్ రామ్ బజాజ్ గోయెల్‌గా కనిపించబోతున్నారు.




## 'హరిహర వీరమల్లు' కోసం
## ప్రభుత్వ నిధులు?

పవన్ కళ్యాణ్‌పై హైకోర్టులో పిటిషన్



**టాకీస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.విజయ్ కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పవన్ కళ్యాణ్ ఇటీవల నటించి ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'హరిహర వీరమల్లు' సినిమా ప్రమోషన్ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నిధులను వాడుకుని దుర్వినియోగం చేశారని ఆయన తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ ఆరోపణలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఎస్.విజయ్ కుమార్ హైకోర్టుని కోరారు.

అయితే విజయ్ కుమార్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. కేసు విచారణ జాబితాలో సీబీఐ, ఏసీబీ న్యాయవాదుల పేర్లను చేర్చాల్సిందిగా రిజిస్ట్రీకి ఆదేశాలు జారీ చేసింది. అలాగే ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు వారం రోజుల పాటు వాయిదా వేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.